పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

# TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 722 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ ఆదివారం 20.09.2026 పేజీలు : 8 వెల : 4/-



## ఇంటర్ బోర్డులో కీలక మార్పులు

### మంత్రి లోకేశ్ నిర్ణయం

- లోకేశ్ నివాసంలో ఇంటర్ బోర్డు పాలకవర్గం సమావేశం
- 1978 నుంచి జారీ చేసిన ఇంటర్ సర్టిఫికెట్లను డిజిటలైజ్ చేయాలని నిర్ణయం
- ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 60 నుంచి 62కి పెంచాలని తీర్మానం

ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యారంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా వైవిధ్యమైన సంస్కరణలకు తెరలేపారు. ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధ్యక్షతన జరిగిన ఇంటర్ బోర్డు 78వ పాలకవర్గ సమావేశంలో విద్యార్థుల భవిష్యత్తుతో పాటు ఉద్యోగుల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకుంటూ అనేక కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేశారు.

తరువాయి 2లో

## విశాఖలో చంద్రబాబు భావోద్వేగం

### "నా జీవితం ధన్యమైంది"

విశాఖలో 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాల పంపిణీ




- మీ ఇంటిపై సర్వ హక్కులు మీవేనని సీఎం చంద్రబాబు భరోసా
- విశాఖను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని భారీ ప్రకటన
- గోదావరి జలాలతో నగర నీటి కష్టాలు శాశ్వతంగా తీరుస్తామని హామీ
- గత ప్రభుత్వ పాలనలో భూ కబ్జాలు, కూల్చివేతలపై తీవ్ర విమర్శలు

విశాఖ నగరంలోని వేలాది పేద కుటుంబాల దశాబ్దాల కల నెరవేరింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం తరువాయి 2లో

నారా బ్రాహ్మణి చేతుల మీదుగా

## WAPL ట్రోఫీ ఆవిష్కరణ

- డబ్ల్యూఏపీఎల్ ప్రారంభోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నారా బ్రాహ్మణి
- మంగళగిరిలో అట్టహాసంగా ప్రారంభమైన తొలి విమెన్స్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్
- నాలుగు జట్లతో మంగళగిరి వేదికగా సెప్టెంబర్ 27 వరకు టోర్నీ
- మహిళా సాధికారతే లక్ష్యమన్న ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్




- ఈ లీగ్‌కు దిగ్గజ క్రికెటర్ మిథాలీ రాజ్ మార్గదర్శకత్వం

ఆంధ్రప్రదేశ్‌లో మహిళా క్రికెట్‌కు కొత్త శకం మొదలైంది. రాష్ట్రంలోని యువ క్రీడాకారిణుల ప్రతిభను తరువాయి 4లో



## ఆసియా క్రీడలు షురూ

### భారత అథ్లెట్లకు మోదీ విషెస్

- జపాన్‌లోని ఐచీ-నగోయాలో 20వ ఆసియా క్రీడలు ఘనంగా ప్రారంభం
- భారత క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని నరేంద్ర మోదీ
- ప్రారంభోత్సవంలో పతాకధారులుగా షూటర్ మను భాకర్, కబడ్డీ స్టార్ పవన్ సెహ్రావత్
- గత ప్రదర్శనను అధిగమించి మరిన్ని పతకాలు గెలవాలనే లక్ష్యంతో భారత్
- క్రికెట్, కబడ్డీ, హాకీలో టైటిళ్లను నిలబెట్టుకోవాలని చూస్తున్న టీమిండియా

ఆసియా ఖండంలోనే అతిపెద్ద క్రీడా సంబరం తరువాయి 2లో

గ్యాస్ సబ్సిడీకి

## బయోమెట్రిక్ మస్ట్!

- వంటగ్యాస్ సబ్సిడీకి బయోమెట్రిక్ ఆధార్ ప్రామాణీకరణ తప్పనిసరి
- 2026 అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధన అమల్లోకి రానుంది
- బయోమెట్రిక్ పూర్తి చేయని వారికి మార్కెట్ ధరకే సిలిండర్ సరఫరా
- అక్రమాలను అరికట్టేందుకే ఈ నిర్ణయమన్న కేంద్ర ప్రభుత్వం
- ఇప్పటికే 90 శాతం మంది వినియోగదారులు బయోమెట్రిక్ పూర్తి చేశారు

2లో






## విధ్వంసక శక్తిగా సైన్యం

### కిమ్ ఆదేశం

2లో

- ఆయుధ కర్మాగారాలను సందర్శించిన కిమ్ జోంగ్ ఉన్
- అత్యంత విధ్వంసకర శక్తిగా ఆర్టిలరీ మారాలని ఆదేశం
- ఆయుధాలలో కృత్రిమ మేధ, ఆటోమేషన్ పెంచాలని సూచన
- ఇటీవల దక్షిణ కొరియా, అమెరికా, జపాన్ విన్యాసాలకు ప్రతిస్పందనగా క్షిపణి ప్రయోగాలు

భారత యువత సత్తాకు

## స్టార్టప్‌లే నిదర్శనం

- 20వ రోజ్‌గార్ మేళాలో 51,000 మందికి పైగా నియామక పత్రాల పంపిణీ
- భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరణ
- చిన్న నగరాల్లోనూ స్టార్టప్‌లు వస్తుండటం శుభపరిణామం అన్న ప్రధాని
- రూ. లక్ష కోట్లతో ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ప్రారంభం
- కొత్తగా చేరిన ఉద్యోగులకు నిరంతర అభ్యాసంపై ప్రధాని మోదీ సూచన

2లో



## యూఎస్ వర్సిటీలకు దెబ్బ

### భారత విద్యార్థులకు వీసా టెన్షన్!

- సగానికి పైగా అమెరికా కాలేజీల్లో తగ్గిన విదేశీ విద్యార్థుల దరఖాస్తులు
- వీసా జాప్యం, తిరస్కరణలే ప్రధాన కారణాలు
- 63 శాతం యూనివర్సిటీ అధికారుల్లో ఇమ్మిగ్రేషన్‌పై ఆందోళన
- విదేశీ విద్యార్థులు తగ్గడంతో 73 శాతం సంస్థల ఆదాయంతో తగ్గుదల
- భారతీయ విద్యార్థులకు కీలకంగా మారిన వీసా పరిస్థితులు




అమెరికాలో ఉన్నత విద్య చదవాలనుకునే విదేశీ విద్యార్థులకు పరిస్థితులు ఏమంత ఆశాజనకంగా కనిపించడం లేదు. 2026 విద్యా సంవత్సరానికి అమెరికాలోని సగానికి పైగా కాలేజీలు, యూనివర్సిటీలకు విదేశీ విద్యార్థుల నుంచి వచ్చే దరఖాస్తులు తగ్గినట్లు తాజా సర్వే వెల్లడించింది. వీసాల జారీ ఆలస్యం, వీసా తరువాయి 2లో

# ఇంటర్ బోర్డులో కీలక మార్పులు: మంత్రి లోకేశ్ నిర్ణయం

ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యారంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా వైవిధ్యమైన సంస్కరణలకు తెరలేపారు. ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధ్యక్షతన జరిగిన ఇంటర్ బోర్డు 78వ పాలకవర్గ సమావేశంలో విద్యార్థుల భవిష్యత్తుతో పాటు ఉద్యోగుల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకుంటూ అనేక కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేశారు. నకిలీ సర్టిఫికెట్ల అక్రమాలకు శాశ్వతంగా ముగింపు పలకాలనే దృఢ సంకల్పంతో 1978 నుంచి జారీ చేసిన ఇంటర్మీడియట్ విద్యార్హత పత్రాలన్నింటినీ సమగ్రంగా డిజిటలైజ్ చేయాలని ప్రతిపాదించారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఈ రికార్డులను అత్యాధునిక 'బ్లాక్‌చైన్ టెక్నాలజీ'తో అనుసంధానించనున్నారు. విద్యా పునర్నిర్మాణంతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి తీపి కబురు అందిస్తూ వారి పదవీ విరమణ వయోపరిమితిని 60 సంవత్సరాల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ తుది తీర్మానం చేశారు. దీనికితోడు పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేసే క్రమంలో ఇన్విజిలేటర్లు, మూల్యాంకనదారుల శ్రమను గుర్తించి వారు అందుకునే భత్యాలను ఏకంగా 25 శాతం వరకు పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. పరీక్షల్లో విద్యార్థుల సౌకర్యార్థం థియరీ సబ్జెక్టులకు 32 పేజీల బుక్‌లెట్లను అందించనున్నారు. మూల్యాంకనంలో ఏమాత్రం అలసత్వం వహించినా లేదా తీవ్రమైన తప్పులకు పాల్పడినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది.

### గ్యాస్ సబ్సిడీకి

## బయోమెట్రిక్ మస్ట్!

దేశీయ వంటగ్యాస్ (ఎల్పీజీ) వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. రాయితీ ధరపై వంటగ్యాస్ సిలిండర్లను పొందేందుకు 2026 అక్టోబర్ 1 నాటికి బయోమెట్రిక్ ఆధార్ ప్రామాణీకరణ (బీఏఏ) ప్రక్రియను పూర్తి చేయడం తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. అర్హులైన కుటుంబాలకు మాత్రమే సబ్సిడీ ప్రయోజనాలు అందేలా చూడటంతో పాటు, గృహ అవసరాల సిలిండర్లు వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు అక్రమంగా మళ్లకుండా నిరోధించడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం వెల్లడించింది. ఆధార్‌తో బయోమెట్రిక్ అనుసంధానం చేయడం ద్వారా డూప్లికేట్, అనర్హమైన కనెక్షన్లను సులభంగా గుర్తించి తొలగించే అవకాశం ఉంటుందని పేర్కొంది. వినియోగదారులు వివిధ మార్గాల్లో ఈ బయోమెట్రిక్ ప్రక్రియను పూర్తి చేసే సౌలభ్యం ఉంది. సిలిండర్ డెలివరీ చేసే సమయంలో సిబ్బంది వద్ద ఉండే మొబైల్ యాప్ ద్వారా, లేదా నేరుగా సమీపంలోని గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ కార్యాలయాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. వీటితో పాటు సంబంధిత ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల అధికారిక మొబైల్ యాప్‌ల (ఇండేన్‌కు ఇండియన్‌ఆయిల్ వన్, భారత్‌గ్యాస్‌కు హలోబీపీసీఎల్, హెచ్‌పీ గ్యాస్‌కు హెచ్‌పీ పే) ద్వారా కూడా వినియోగదారులు స్వయంగా ప్రామాణీకరణ చేసుకోవచ్చని ప్రభుత్వం సూచించింది. ఇప్పటికే బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తి చేసిన వారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయని పక్షంలో సబ్సిడీ వర్తించదు. అటువంటి వారు సిలిండర్‌ను మార్కెట్ ధరకే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 19 నాటికి దేశవ్యాప్తంగా దాదాపు 90 శాతం మంది, అంటే 27.43 కోట్ల మంది వినియోగదారులు ఇప్పటికే బయోమెట్రిక్ ప్రామాణీకరణను పూర్తి చేశారని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం 14.2 కిలోల వంటగ్యాస్ సిలిండర్‌పై సుమారు రూ. 210 వరకు రాయితీ లభిస్తోంది. కేవలం అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఈ ప్రయోజనం చేకూరేలా చూడటం ప్రభుత్వ ఆర్థిక సుస్థిరతకు అత్యవసరమని కేంద్ర ప్రభుత్వం తన ప్రకటనలో పేర్కొంది.

# విశాఖలో చంద్రబాబు భావోద్వేగం: "నా జీవితం ధన్యమైంది"




విశాఖ నగరంలోని వేలాది పేద కుటుంబాల దశాబ్దాల కల నెరవేరింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం ద్వారా 28,445 కుటుంబాలకు వారు నివసిస్తున్న ఇళ్లపై సర్వ హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేశారు. శనివారం విశాఖలో జరిగిన సభలో ఆయన లబ్ధిదారులకు కన్వీనియన్స్ డీడ్స్ అందజేశారు. ఈ నిర్ణయంతో వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపామని అన్నారు. వేలాది కుటుంబాల దశాబ్దాల కల సాకారమైన వేళ వారి ముఖాల్లో వెల్లివిరిసిన ఆనందాన్ని చూసి, "మీ ముఖాల్లో ఈ ఆనందం చూస్తే నా జీవితం ధన్యమైంది. నా ప్రాణం ఉన్నంతవరకు ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటాను" అంటూ చంద్రబాబు భావోద్వేగంతో ప్రసంగించారు. ఇది కేవలం పట్టాల పంపిణీ కాదని, పేద ప్రజల ఆత్మగౌరవానికి, వారి పిల్లల భవిష్యత్తుకు చేస్తున్న పట్టాభిషేకం అని ఆయన అభివర్ణించారు.

*** దశాబ్దాల నిరీక్షణకు తెర.. సర్వ హక్కులు మీవే!**

"కూడు, గూడు, గుడ్డ అనేది మా విధానం. 40 ఏళ్ల క్రితమే ఎన్టీఆర్ పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలని సంకల్పిస్తే, అదే స్ఫూర్తితో మేము పనిచేస్తున్నాం" అని చంద్రబాబు గుర్తుచేశారు. దశాబ్దాలుగా సొంత కష్టార్జితంతో నిర్మించుకున్న ఇళ్లలో నివసిస్తున్నా, వాటిపై పూర్తి హక్కు లేదనే వేదనతో జీవిస్తున్న లక్షలాది మందికి ఈ పట్టాభిషేకం ద్వారా విముక్తి కల్పించామన్నారు. "నిన్నటి వరకు మీ ఇంటిపై మీకు హక్కు లేదు. కానీ ఈరోజు నుంచి మీ ఇంటి మీద సర్వ హక్కులు మీవే. ఇకపై అనుమానం లేదు, వివాదం లేదు, భయం లేదు. తిరుగులేని హక్కు మాత్రమే ఉంటుంది" అని ఆయన భరోసా ఇచ్చారు. విశాఖ నగర పరిధిలోని గాజువాక, పెందుర్తి, భీమిలి, గోపాలపట్నం సహా 111 మండలాల్లోని 399 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 19.33 లక్షల చదరపు గజాల భూమిని క్రమబద్ధీకరించి, రూ. 8,874 కోట్ల రిజిస్ట్రేషన్ విలువైన ఆస్తిని ప్రజలకు అప్పగించామని తెలిపారు. "నిన్నటి వరకు అప్పు కావాలంటే గ్యారెంటీ లేని మీరు, ఈరోజు ఈ ప్రభుత్వం ఇచ్చిన పట్టాతో ఏ బ్యాంకులోనైనా స్వేచ్ఛగా రుణం పొందవచ్చు" అని ఆయన స్పష్టం చేశారు.

*** మిగిలిన వారికీ త్వరలోనే పట్టాలు.. అధికారులకు ఆదేశాలు**

ఈ కార్యక్రమంతోనే ఆగమని, వివిధ కారణాలతో ఆగిపోయిన మరో 35 కాలనీల్లోని 10,000 కుటుంబాలకు, వివాదాల్లో ఉన్న పంచగ్రామాల పరిధిలోని 12,149 మందికి కూడా త్వరలోనే పట్టాలు అందించి శాశ్వత హక్కులు కల్పిస్తామని చంద్రబాబు సభాముఖంగా హామీ ఇచ్చారు. "దేవాలయ భూముల వివాదాలను కోర్టుల ద్వారా పరిష్కరించి, వీలైనంత తొందరగా మీ అందరికీ న్యాయం చేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది" అని ఆయన కలెక్టర్‌కు వేదిక నుంచే ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న ప్రతి పేదవాడికీ హక్కు పత్రాలు అందించి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

*** దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినట్టే!**

గత ఐదేళ్ల పాలనపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత ఐదేళ్లు ఒక పీడకల. రూ.10 లక్షల కోట్ల అప్పులు, ఎక్కడ చూసినా కుంభకోణాలు, భూకబ్జాలు, కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. ప్రశాంతమైన ఉత్తరాంధ్రలో అలజడి సృష్టించారు. శుక్రవారం వచ్చిందంటే ఏ ఇంటిని కూలుస్తారో తెలియని భయానక వాతావరణం ఉండేది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "విశాఖను రాజధాని చేస్తామంటూనే, రుషికొండపై ఋషులు తపస్సు చేసిన చోట ప్యాలెస్‌లు కట్టుకున్నారు. ఆ ప్యాలెస్‌ను ఏం చేయాలో కూడా అర్థం కాని దుస్థితిలో మేమున్నాం. దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినంత ఖర్చు అవుతుంది" అని ఎద్దేవా చేశారు. "నాడు కబ్జాలు, కూల్చివేతలు ఉంటే.. నేడు హక్కులు, భరోసా ఇస్తున్నాం. విధ్వంసం నుంచి వికాసం వైపు, భయం నుంచి భరోసా వైపు, నిరాశ నుంచి కొత్త ఆశల వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం" అని ఆయన ఉద్ఘాటించారు.

*** విశాఖ ఇక విశ్వనగరం.. నీటి సమస్యకు ఎన్డీయే గ్యారెంటీ!**

విశాఖపట్నం భవిష్యత్తుపై చంద్రబాబు స్పష్టమైన దార్శనికతను ఆవిష్కరించారు. "రాబోయే రోజుల్లో విశాఖ ఒక విశ్వనగరంగా మారబోతోంది. ఇది ఇక అన్‌స్టాపబుల్. గూగుల్, రిలయన్స్ డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులతో పాటు అనేక ఐటీ పరిశ్రమలు వస్తున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుంది" అని ఆయన ప్రకటించారు. విశాఖ నీటి సమస్యపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ, "ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గినా, ముందుచూపుతో మేము పూర్తి చేసిన పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీళ్లు తెచ్చాం. ఇప్పుడు అదే కాలువను విశాఖ వరకు పొడిగించి, గోదావరి జలాలతో నగర దాహార్తిని శాశ్వతంగా తీర్చే బాధ్యత మా ఎన్డీయే ప్రభుత్వానిది. భవిష్యత్తులో విశాఖకు నీటి కొరత ఉండదు, ఇది మా గ్యారెంటీ" అని చంద్రబాబు గట్టిగా హామీ ఇచ్చారు.

*** అభివృద్ధికి అండగా నిలవండి.. 2047 లక్ష్యం మనదే!**

పరిశ్రమలు తెచ్చి అవకాశాలు కల్పించడం తమ బాధ్యత అని, వాటిని అందిపుచ్చుకుని యువత ఎదగాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "విశాఖ ఉక్కును కాపాడింది ఎన్డీయే ప్రభుత్వం. రైల్వే జోన్‌ను రియాలిటీగా మార్చింది మేము. పేదరికం లేని సమాజం, ఆర్థిక అసమానతలు తగ్గడమే మా లక్ష్యం" అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, 'స్వచ్ఛాంధ్ర'లో భాగస్వాములు కావాలని కోరారు. "2047 నాటికి 'వికసిత భారత్'తో దేశం ప్రపంచంలో నంబర్ వన్ అవుతుంది. అదే సమయంలో 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యంతో మన రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతాం. ప్రపంచంలోనే తెలుగు జాతిని అత్యంత శక్తివంతమైన జాతిగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిదీ" అని పిలుపునిస్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, నారాయణ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

### ఆసియా క్రీడలు షురూ

## భారత అథ్లెట్లకు మోదీ విషెస్

ఆసియా ఖండంలోనే అతిపెద్ద క్రీడా సంబరం మొదలైంది. జపాన్‌లోని ఐచీ నగోయా నగరాలు వేదికగా 20వ ఆసియా క్రీడలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నగోయాలోని మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో జరిగిన అట్టహాస వేడుకలో జపాన్ చక్రవర్తి నరుహిటో ఈ క్రీడలను అధికారికంగా ప్రారంభించినట్లు ప్రకటించారు. రాబోయే రెండు వారాల పాటు వేలాది మంది క్రీడాకారులు పతకాల కోసం పోటీ పడనున్నారు. ఈ చారిత్రాత్మక ఈవెంట్ సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, దేశ క్రీడా బృందానికి తన శుభాకాంక్షలు తెలిపారు. "ఐచీ నగోయాలో ఆసియా క్రీడలు ప్రారంభమవుతున్న వేళ, భారత బృందానికి నా శుభాకాంక్షలు. ప్రతి క్రీడాకారుడు అద్భుతమైన కృషి, అంకితభావం, దృఢ సంకల్పాన్ని ప్రదర్శించారు. వారిని చూసి భారతదేశం గర్విస్తోంది. వారు తమ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలి, బాగా ఆడాలి, ప్రకాశించాలి!" అని ప్రధాని 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. ప్రారంభోత్సవ వేడుక భారత్‌కు ఎంతో ప్రత్యేకంగా నిలిచింది. ఒలింపిక్ పతక విజేత, షూటర్ మను భాకర్, కబడ్డీ స్టార్ పవన్ సెహ్రావత్ భారత బృందానికి పతాకధారులుగా ముందుండి నడిపించారు. త్రివర్ణ పతాకాన్ని చేతబూని స్టేడియంలోకి అడుగుపెట్టిన వీరిపై దేశం భారీ అంచనాలు పెట్టుకుంది. 2023లో హాంగ్‌జౌలో జరిగిన గత ఆసియా క్రీడల్లో 28 స్వర్ణాలతో సహా మొత్తం 107 పతకాలు సాధించి భారత్ రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఈసారి ఆ రికార్డును అధిగమించాలనే లక్ష్యంతో భారత బృందం బరిలోకి దిగుతోంది. ఆసియా క్రీడలకు జపాన్ ఆతిథ్యం ఇవ్వడం ఇది మూడోసారి. గతంలో 1958లో టోక్యోలో, 1994లో హిరోషిమాలో ఈ పోటీలు జరిగాయి. ఈసారి 45 దేశాలకు చెందిన క్రీడాకారులు 43 క్రీడాంశాల్లో తలపడనున్నారు. ఈ పోటీల్లో భారత్ పలు క్రీడల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. పురుషుల, మహిళల క్రికెట్, కబడ్డీ జట్లతో పాటు, పురుషుల హాకీ జట్టు కూడా తమ టైటిళ్లను నిలబెట్టుకోవాలని చూస్తోంది. బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు, వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను భారత ప్రచారానికి నాయకత్వం వహించనున్నారు. షూటింగ్‌లో మను భాకర్, రెజ్లింగ్‌లో అమన్ సెహ్రావత్, బాక్సింగ్‌లో లవ్లీనా బోర్గోహెన్ వంటి ప్రముఖులు పతకాలపై కన్నేశారు. అథ్లెటిక్స్‌లో 75 మందికి పైగా భారత క్రీడాకారులు బరిలో ఉన్నారు. గుల్వీర్ సింగ్, తేజస్విన్ శంకర్, జ్యోతి యర్రాజీ, పారుల్ చౌదరి వంటి అథ్లెట్లు తమ సత్తా చాటడానికి సిద్ధమయ్యారు. షాట్‌పుట్‌లో తజిందర్‌పాల్ సింగ్ తూర్ వరుసగా రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచి, ఈసారి కూడా ఫేవరెట్‌గా పోటీ పడుతున్నాడు.

# యూఎస్ వర్సిటీలకు దెబ్బ.. భారత విద్యార్థులకు వీసా టెన్షన్!

అమెరికాలో ఉన్నత విద్య చదవాలనుకునే విదేశీ విద్యార్థులకు పరిస్థితులు ఏమంత ఆశాజనకంగా కనిపించడం లేదు. 2026 విద్యా సంవత్సరానికి అమెరికాలోని సగానికి పైగా కాలేజీలు, యూనివర్సిటీలకు విదేశీ విద్యార్థుల నుంచి వచ్చే దరఖాస్తులు తగ్గినట్లు తాజా సర్వే వెల్లడించింది. వీసాల జారీ ఆలస్యం, వీసా తిరస్కరణలు, కఠినమైన ఇమ్మిగ్రేషన్ నిబంధనలు ఇందుకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ఈ పరిణామాలతో ముఖ్యంగా భారత్, చైనా నుంచి అమెరికా వెళ్లాలనుకునే విద్యార్థుల్లో ఆందోళన పెరుగుతోంది. అమెరికన్ కౌన్సిల్ ఆన్ ఎడ్యుకేషన్ (ఏసీఈ) 328 మంది ఉన్నత విద్యా సంస్థల సీనియర్ అధికారులతో ఈ సర్వే నిర్వహించింది. ఇందులో 63 శాతం మంది ఇమ్మిగ్రేషన్ ఆంక్షలు, వీసాల రద్దుపై తీవ్రంగా లేదా కొంతమేర ఆందోళన ఉన్నట్లు చెప్పారు. అంతేకాదు.. 36 శాతం మంది ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు తమ యూనివర్సిటీలు సిద్ధంగా లేవని తెలిపారు. అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య తగ్గడం అమెరికా యూనివర్సిటీల అడ్మిషన్లపైనే కాదు.. వాటి ఆర్థిక పరిస్థితిపైనా ప్రభావం చూపుతుంది. విదేశీ విద్యార్థులను చేర్చుకునే యూనివర్సిటీల అధ్యక్షుల్లో 73 శాతం మంది.. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో తమ ఆదాయం కూడా తగ్గిందని తెలిపారు. దీని ప్రభావం ఇప్పటికే కొన్ని క్యాంపస్‌లలో కనిపిస్తోంది. 23 శాతం మంది అధికారులు పరిశోధనలు, విద్యార్థుల సహాయ కార్యక్రమాలకు కేటాయించే బడ్జెట్‌ను తగ్గించినట్లు చెప్పారు. 9 శాతం మంది కొన్ని కోర్సులను మూసివేయడం లేదా ఇతర కోర్సులతో విలీనం చేయాల్సి వచ్చిందన్నారు. మరో 11 శాతం మంది విద్యార్థులకు ఇచ్చే ఆర్థిక సాయం తగ్గినట్లు వెల్లడించారు. అమెరికా యూనివర్సిటీలో సీటు రావడం ఒక్కటే ఇప్పుడు సరిపోదు. అడ్మిషన్ వచ్చిన తర్వాత వీసా ఎప్పుడు వస్తుంది? ఇమ్మిగ్రేషన్ నిబంధనల్లో ఏమైనా మార్పులు వస్తాయా? అనే అంశాలు కూడా విద్యార్థులకు కీలకంగా మారాయి. వీసా ప్రక్రియ ఆలస్యమైతే, నిర్ణయించిన సమయానికి విద్యార్థులు అమెరికా వెళ్లి తరగతులకు హాజరుకావడం కష్టమవుతుంది. అదే సమయంలో వీసాలపై అనిశ్చితి కొనసాగితే యూనివర్సిటీలు కూడా విదేశీ విద్యార్థుల సంఖ్యను అంచనా వేయడం కష్టమవుతుంది. ఇప్పటికే అమెరికా యూనివర్సిటీల్లో దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం ప్రధాన ఆందోళనగా మారింది. ఈ నేపథ్యంలో విదేశీ విద్యార్థుల దరఖాస్తులు, అడ్మిషన్లు తగ్గడం అక్కడి విద్యా సంస్థలకు మరో సవాలుగా మారుతోంది.

## భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశంలోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టార్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు. 20వ రోజ్‌గార్ మేళా సందర్భంగా శనివారం ఆయన వివిధ ప్రభుత్వ సంస్థలకు కొత్తగా ఎంపికైన యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల నుంచి 51,000 మందికి పైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "భారతదేశం నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచింది. గుర్తించబడిన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్ 2, టైర్ 3 నగరాల్లోనే ఉన్నాయి. ఇది భారతదేశ నూతన ఆర్థిక వ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల నుంచి వచ్చిన యువత కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని చూపిస్తోంది" అని వివరించారు. చిన్న పట్టణాలకు చెందిన యువత తమ సొంత ఆలోచనలతో కొత్త కంపెనీలను స్థాపిస్తూ, తమతో పాటు ఇతర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను వేగంగా విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు. "ఈ లక్ష్యంతోనే సుమారు రూ. 1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించాం.

# విధ్వంసక శక్తిగా సైన్యం కిమ్ ఆదేశం

ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ తమ దేశ సైనిక సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా కీలక ఆదేశాలు జారీ చేశారు. తమ ఫిరంగి దళాలు (ఆర్టిలరీ) అత్యంత కేంద్రీకృత, విధ్వంసకర సామర్థ్యాలను కలిగి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ వారంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు ఆయన పలు కీలక ఆయుధ కర్మాగారాలను సందర్శించారు. ఈ పర్యటన వివరాలను ఉత్తర కొరియా అధికారిక మీడియా వెల్లడించింది. 'కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ' (కేసీఎన్ఏ) కథనం ప్రకారం.. రూలింగ్ వర్కర్స్ పార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్ వైస్ ఛైర్మన్ పాక్ జోంగ్ చోన్‌తో సహా పలువురు ఉన్నతాధికారులు కిమ్ వెంట ఉన్నారు. ఈ సందర్భంగా కిమ్ మాట్లాడుతూ.. "యుద్ధాన్ని నిరోధించడం, యుద్ధంలో పోరాడటం అనే రెండు కీలక బాధ్యతలను మన ఆర్టిలరీ సమర్థంగా నిర్వర్తించాలి. దీని కోసం అత్యంత విధ్వంసకర, బహుముఖ దాడి సామర్థ్యాన్ని కలిగి ఉండాలి" అని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యాన్ని నిర్మించాలనే పార్టీ వ్యూహాత్మక విధానంలో ఆయుధ పరిశ్రమ కీలక పాత్ర పోషించాలని కిమ్ ఉద్ఘాటించారు. దాడి, రక్షణ ఆయుధాలలో కృత్రిమ మేధ (ఏఐ) స్థాయిని పెంచడం, ఫిరంగి ఆయుధాల ఆటోమేషన్, ఉత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరచడం వంటి విధానపరమైన పనులను ఆయన నిర్దేశించారు.

## సంపాదకీయం

# డాలర్ ఆధిపత్యం
# ప్రపంచ ఆర్థిక యుద్ధాలు - బ్రిక్స్ సవాళ్లు

ప్రపంచం ఆర్థిక సంక్షోభంలో కొట్టుకుపోతున్నది. విచిత్రం ఏమిటంటే, ఆర్థిక సంక్షోభాలే చాలా యుద్ధాలకు కారణాలు అవుతూ ఉంటాయి. అవే యుద్ధాలు ఆర్థిక సంక్షోభాలను విశ్వవ్యాప్తం చేస్తాయి. అమెరికా ఆర్థిక విధానాలే ప్రపంచంలో ఆర్థిక సంక్షోభానికి కారణం అనేది కొంతవరకూ వాస్తవమే; కానీ ప్రతి యుద్ధం వెనుకా అమెరికాయే కారణం అనుకోవడానికి లేదు. కాకపోతే, ఆ యుద్ధానికో లేదా ఆర్థిక సంక్షోభానికో కారణం వెతుక్కుంటూ పోతే దశాబ్దాలుగా అమెరికా తహతహలాడే పెద్దన్న పాత్ర కోరిక మనకు స్పష్టమవుతుంది. ట్రంప్ లాంటివారి యుద్ధోన్మాదం బాహాటంగా కనిపిస్తుంది, బుష్ లాంటివారివి ప్రత్యక్షంగా కనిపించవు. అలాగే ప్రపంచంలో యుద్ధాల వలన వచ్చే ఆర్థిక సంక్షోభాలు కనిపిస్తూ ఉంటాయి; కానీ అమెరికాలో ద్రవ్యోల్బణం హెచ్చుతగ్గుల రీత్యా ప్రపంచ దేశాల ఆర్థిక స్థితిగతుల్లో వచ్చే మార్పులు కంటికి కనిపించవు. అమెరికా ఆర్థిక పరిస్థితులు మన ఇంట్లో కూడా ప్రతిబింబిస్తాయి అనగానే, అక్కడ మనవాళ్లు చేసే ఉద్యోగాలు పోతాయనో లేదా ఇక్కడి నుండి వెళ్లేవాళ్లకు ఉద్యోగాలు రాకపోవటం జరుగుతుందనో మాత్రమే భయపడతాం. అది చాలా చిన్న అంశం. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్లను పెంచగానే డాలర్ విలువ పెరుగుతుంది. ఇప్పటికీ పెట్టుబడిదారుడు తన పెట్టుబడిని సురక్షితంగా భావించేది డాలర్లపై పెట్టే పెట్టుబడిని, తరువాత బంగారంపైన. డాలర్ బలంగా ఉన్నదనుకుంటే డాలర్ మీదనే పెట్టుబడి పెడతాడు; డాలర్ కాస్త అటూఇటూగా ఉన్నదనుకుంటే బంగారంపైన పెడతారు. మనదేశంలో బంగారం అనేది పెట్టుబడిగా కంటే భావోద్వేగానికి చిహ్నంగా భావిస్తాం. ఇళ్లల్లో, ఆభరణాల రూపంలో భారతదేశంలో ఉన్న బంగారం 25,000 టన్నుల పైచిలుకు. ఇది కూడా ప్రకటించిన బంగారం మాత్రమే. ఇక నల్లధనాన్ని బంగారపు బిస్కట్ల రూపంలో దాచిన వారి వద్ద ఎంత ఉన్నదో లెక్కలు లేవు. తాళిబొట్టు అనేది మన సంస్కృతి. అకస్మాత్తుగా నిన్న కొన్న బంగారపు తాళిబొట్టు ఈరోజు ఒక వెయ్యి రూపాయలు పడిపోతుంది; లేదా బిడ్డ పెళ్లికి తాళిబొట్టు కోసం ఈరోజు వెళ్లి బేరసారాలు సాగించి రేపు కొందామని వెళ్లేటప్పటికి రెండు వేలు పెరుగుతుంది. అకస్మాత్తుగా ఎందుకు పెరిగిందో మనకు అర్థం కాదు. అమెరికాలో ద్రవ్యోల్బణం పెరిగితే దానిని అదుపు చేయటానికి అమెరికా సెంట్రల్ బ్యాంకు వడ్డీ రేట్లను పెంచుతుంది. వడ్డీరేట్లు పెరగగానే డాలర్పైన పెట్టుబడులు పెరిగి, బంగారం మీద పెట్టుబడి తగ్గుతుంది. ద్రవ్యోల్బణం అదుపులో ఉంటే ఫెడరల్ వడ్డీ రేట్లు తగ్గించగానే మళ్లీ బంగారంపైన పెట్టుబడులు పెరుగుతాయి; ఫలితంగా అంతర్జాతీయంగా బంగారం ధరలు పెరుగుతాయి. అంటే "ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చింది" అన్న చందంగా, అమెరికా దేశంలోని ఆర్థిక పరిస్థితి భారతదేశంలో రిక్షా తొక్కేవాడి భార్య మెడలో ఉన్న తాళిబొట్టు ధరను అటూఇటూ మారుస్తుంది. ఇది మనకు అర్థమయ్యే విషయం మాత్రమే. ఇదే ప్రభావం మన దేశ వ్యాపారవర్గాల పైన కూడా ఉంటుంది. ఎటువంటి వ్యాపారులపైన ఉంటుందనేది తరువాత విషయం. బాధిత దేశం ఒక్క భారతదేశం మాత్రమే కాదు; అమెరికా ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక రాజకీయాలనే కాక కొన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలను కుప్పకూల్చి వేస్తాయి. కారణం డాలర్కున్న శక్తి. అమెరికా శక్తి అంటేనే డాలర్. పెట్టుబడులకు స్వర్గధామం అమెరికా అంటే దాని వెనుక ఉన్న ప్రధాన శక్తి డాలర్. అమెరికా ప్రపంచాన్ని శాసించటానికి కారణం డాలర్ శక్తి. డాలర్కు ఎందుకు ఇంత శక్తి అంటే, ప్రపంచంలో జరిగే వాణిజ్యంలో ఎగుమతులు, దిగుమతుల చెల్లింపుల్లో దాదాపు 80 శాతం డాలర్లలోనే జరుగుతున్నది. ప్రపంచ కరెన్సీ మార్కెట్లో జరిగే మొత్తం రోజువారీ లావాదేవీలలో—అంటే సరుకులు, కరెన్సీ మార్పిడులలో ఒకవైపు డాలర్ ఉండే లావాదేవీలలో—సుమారు 90 శాతం వాటా డాలర్దే. ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంకులు తమ వద్ద ఉంచుకునే విదేశీ మారక నిల్వలలో సుమారు 60 శాతం ఇప్పటికీ డాలర్ల రూపంలోనే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు లేదా విదేశీ కంపెనీలు తీసుకునే రుణాలలో దాదాపు 60 శాతానికి పైగా డాలర్ల రూపంలోనే నమోదు అవుతాయి. డాలర్ ఇంత బలపడటానికి ప్రధాన కారణం ముడి చమురు దగ్గర నుండి ఆహార ధాన్యాల వరకు ప్రధాన నిత్యావసర వస్తువుల ధరల నిర్ణయం మరియు వ్యాపారం డాలర్లలో జరగటమే. వ్యాపారానికి పునాది నమ్మకం. ఇప్పటివరకు డాలర్ను నమ్ముకుని పెట్టుబడిదారుడు మోసపోలేదు కాబట్టి డాలర్ తన అజేయమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నది అనేది ఎంత వాస్తవమో, యూరోపియన్ యూనియన్కు తప్ప ఏ ప్రాంతానికీ/కూటమికీ స్వంత ఉమ్మడి ఆర్థిక వ్యవస్థ లేకపోవటం మరో ముఖ్యమైన కారణం. యూరోపియన్ యూనియన్ దేశాల సమాఖ్యలో 20 దేశాలు యూరోను ఉమ్మడి కరెన్సీగా ఉపయోగిస్తున్నప్పటికీ, అంతర్జాతీయ మార్కెట్లలో వాణిజ్యం జరిపేటప్పుడు ఐరోపా దేశాలు కూడా డాలర్పైనే ఆధారపడుతున్నాయి. డాలర్ బలపడగానే మన దగ్గర నిత్య జీవితావసరాల భారం ఎలా పెరుగుతుందో, ఐరోపా దేశాలలో కూడా అదే పరిస్థితి. అందుకే యూరోపియన్ యూనియన్ దేశాలు డాలర్ ప్రభావం తమపైన పడకుండా ఉండటం కోసం యూరో యొక్క అంతర్జాతీయ హోదాను పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాయి. యూఎస్ డాలర్తో పనిలేకుండా వేరే దేశాలతో వ్యాపారం చేయటానికి ప్రత్యేక చెల్లింపు/రవాణా వ్యవస్థలను రూపొందించాయి. చమురు, గ్యాస్ల కోసం వేరే దేశాల మీద ఆధారపడటం తగ్గించి, పునరుత్పాదక ఇంధనం వైపు మారటం ద్వారా డాలర్ ఆధారిత దిగుమతులను తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఇప్పుడు బ్రిక్స్ దేశాలు అంతర్జాతీయ వ్యాపార లావాదేవీలలో అమెరికన్ డాలర్ ఆధిపత్యానికి చెక్ పెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. బ్రిక్స్ దేశాలు విదేశీ వ్యాపారంలో డాలర్లపై ఆధారపడటం తగ్గించటానికి తమ స్వంత కరెన్సీల ద్వారా నేరుగా లావాదేవీలు జరిపే ప్రయత్నం చేస్తున్నాయి. ఇప్పుడు ఉమ్మడి బ్రిక్స్ కరెన్సీని లేదా డిజిటల్ కరెన్సీని తీసుకురావాలని చర్చ మొదలుపెట్టాయి. ఈ కొత్త కరెన్సీని బంగారంతో కానీ, విలువైన ఖనిజాల ఆధారంగా కానీ డిజైన్ చేయాలనే ప్రతిపాదనలు చేస్తున్నాయి. అమెరికా నియంత్రణలో ఉండే స్విఫ్ట్ బ్యాంకింగ్ నెట్వర్క్ మీద ఆధారపడకుండా 'బ్రిక్స్ పే' అనే స్వతంత్ర వ్యవస్థను అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనను ముందుకు తీసుకువెళ్తున్నాయి. అయితే ఇది అనుకున్నంత సులభం కాదు. బ్రిక్స్ దేశాలలో ప్రపంచ జనాభాలో 45 శాతం జనాభా ఉన్నది; రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు ఉన్నాయి. ప్రపంచ జీడీపీలో 37 శాతం వాటా బ్రిక్స్ దేశాలదే; ప్రపంచ చమురు ఉత్పత్తిలో 43 శాతం వాటా బ్రిక్స్ దేశాలదే; అంతర్జాతీయ వ్యాపార లావాదేవీలలో 25 శాతం బ్రిక్స్ దేశాలదే. గతంలో సంపన్న దేశాల కూటమి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసిస్తే, ఇప్పుడు బ్రిక్స్ దేశాల కూటమి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఇంజన్గా మారింది. ఇన్ని ఉన్నప్పటికీ బ్రిక్స్ స్వంత కరెన్సీకి అవరోధాలు చాలా ఉన్నాయి. డాలర్కు ప్రత్యామ్నాయంగా రూపొందించే కరెన్సీ వలన చైనా ఆధిపత్యం పెరుగుతుందనేది భారత్కు ఉన్న సందేహం. ఇరు దేశాల మధ్య ఉన్న సరిహద్దు వివాదాలు, అరవైల నుండి ఉన్న మరికొన్ని సున్నితమైన అంశాలు భారత్ను కలవరపెడుతూనే ఉంటాయి. పసిఫిక్ తీరంలో చైనా ఆధిపత్యం పెరగకుండా ఉండటానికి అమెరికా నాయకత్వంలోని క్వాడ్ కూటమిలో భారత్ చురుకుగా ఉండటం చైనాకు కంటకంగా ఉన్నది. అదే సమయంలో పాశ్చాత్య దేశాలతో సన్నిహితంగా ఉండే భారత్, నాటో వంటి మిలిటరీ కూటమిలో చేరటానికి నిరాకరిస్తూ తన స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకుంటున్నది. ముఖ్యంగా భారత్ చేసే అంతర్జాతీయ ఎగుమతులు, దిగుమతులలో 80 శాతం డాలర్ల రూపంలోనే చేస్తున్నది. డాలర్కు చైనా, రష్యాలంత వ్యతిరేకం కాదు భారత్. అందువలన బ్రిక్స్ దేశాలు చర్చిస్తున్న ఉమ్మడి కరెన్సీ/ఆర్థిక వ్యవస్థకు బాలారిష్టాలు చాలా ఉన్నాయి. కానీ డాలర్ శక్తి అలాగే ఉన్నంత కాలం అమెరికా తన ఆధిపత్యాన్ని వ్యాపారంలోనే కాక చాలా దేశాల అంతర్గత వ్యవహారాలలో కూడా చెలాయిస్తూ, జోక్యం చేసుకుంటూనే ఉంటుంది.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### సెప్టెంబర్ 20

SEP 20

* 1569: మొఘల్ సామ్రాజ్యపు నాలుగవ చక్రవర్తి జహాంగిర్ జననం (మ.1627).
* 1911: సంఘసంస్కర్త ఆచార్య శ్రీరామ్ శర్మ జననం (మ.1990). (చిత్రంలో)
* 1914: తెలుగు శాస్త్రవేత్త, ఎ.యస్.రావు గా ప్రసిద్ధుడైన అయ్యగారి సాంబశివరావు జననం (మ.2003).
* 1924: తెలుగు సినిమా నటుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత డా.అక్కినేని నాగేశ్వరరావు జననం (మ.2014).
* 1944: భారత పార్లమెంటు


శ్రీరామ్ శర్మ

సభ్యుడు అన్నయ్యగారి సాయిప్రతాప్ జననం.
* 1999: తమిళ సినిమా నటి టి.ఆర్.రాజకుమారి మరణం (జ.1922).




## అండమాన్లో అల్పపీడనం
# మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండం

* ఉత్తర అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం
* వాయుగుండంగా బలపడి ఉత్తరాంధ్ర తీరం వైపు పయనం
* సోమవారం నుంచి కోస్తాంధ్రలో భారీ వర్షా లు కురిసే అవకాశం
* తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరిక
* మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ సూచన

ఆంధ్రప్రదేశ్కు మరోసారి వర్ష సూచన వెలువడింది. ఉత్తర అండమాన్, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇది రానున్న రోజుల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని, దీని ప్రభావంతో కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ కథనం ప్రకారం, ప్రస్తుతం అండమాన్లో కేంద్రీకృతమైన ఈ అల్పపీడనం క్రమంగా బలపడనుంది. సోమవారం నాటికి ఇది వాయుగుండంగా, మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉంది. అనంతరం వాయవ్య దిశగా పయనించి, బుధవారం ఉదయానికి దక్షిణ ఒడిశా ఉత్తరాంధ్ర తీరాలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఈ అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణం మారనుంది. ఆదివారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై, పలుచోట్ల విస్తారంగా వర్షాలు పడతాయని తెలిపింది. ముఖ్యంగా సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో రానున్న ఐదు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. తీరప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

## ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు
# పోలింగ్ స్టేషన్ల ఖరారు

అమరావతి: రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల (MPTC and ZPTC elections) కోసం 28 జిల్లాల్లో పోలింగ్ స్టేషన్ల ఖరారు పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ నెల 9న ప్రారంభమైన ఈ ప్రక్రియలో భాగంగా 15, 16 తేదీల్లో రాజకీయపక్షాల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించినట్టు ఈసీ వెల్లడించింది. రాష్ట్రంలో మొత్తం 660 జడ్పీటీసీ స్థానాలు, 10,047 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. పదవీ కాలం వచ్చే వారంలో ముగియనుండటంతో రాష్ట్ర ఎన్నికల



సంఘం వీటి ఎన్నికలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై దృష్టి పెట్టింది. అందులో భాగంగానే ముందుగా పోలింగ్ స్టేషన్ల సంఖ్యను ఖరారు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.

## చర్లపల్లి శ్రీకాకుళం మధ్య 16 ప్రత్యేక రైళ్లు..
# ఎప్పట్నుంచంటే?

రాబోయే పండగల సీజన్ను దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు మార్గాల్లో ప్రత్యేక రైలు సర్వీసులు నడిపేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా చర్లపల్లి శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య 16 ప్రత్యేక రైళ్ల సర్వీసులను నడపనున్నట్లు శనివారం మధ్యాహ్నం ప్రకటించారు. ఈ ప్రత్యేక సర్వీసులు అక్టోబరు 6 నుంచి నవంబరు 25వరకు ప్రతి మంగళ, బుధ వారాల్లో రాకపోకలు సాగిస్తాయని ద.మ.రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు.

# ఒమేగా అను హాస్పిటల్‌లో.. విజయవంతంగా అత్యాధునిక బృహద్ధమని చికిత్సలు

* వేర్వేరు వయసుల ఇద్దరు రోగులకు EVAR, TEVAR చికిత్సలు
* మహానగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఒమేగా అనులో అధునాతన ఏఓర్టిక్ చికిత్స
* మినిమల్లీ ఇన్వేసివ్ విధానాలతో సంక్లిష్ట కేసులకు చికిత్స
* తల నుంచి పాదాల వరకు పలు రక్తనాళ సమస్యలకు ఇంటర్వెన్షనల్ రేడియాలజీ చికిత్సలు
* ప్రముఖ వాస్క్యులర్ అండ్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ మానం భవానీ శంకర్





విజయవాడ రూరల్: సంక్లిష్టమైన బృహద్ధమని (ఏఓర్టిక్) అన్యూరిజమ్‌లతో బాధపడుతున్న ఇద్దరు రోగులకు ఒమేగా అను హాస్పిటల్‌లో ఆధునిక మినిమల్లీ ఇన్వేసివ్ ఎండోవాస్క్యులర్ చికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు వాస్క్యులర్ అండ్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ మానం భవానీ శంకర్ తెలిపారు. ఎనికేపాడులోని ఒమేగా అను హాస్పిటల్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. పేషెంట్లలో ఒకరు యువతి కాగా, మరొకరు వృద్ధుడు. యువతి సాధారణ ఆరోగ్య పరిస్థితిలో ఉండగా, వృద్ధుడు గుండె, మూత్రపిండ సమస్యలతో పాటు ఇటీవల సెప్సిస్‌కు గురై అధిక ప్రమాద పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. మొదటి కేసులో, యువతికి అబ్డామినల్ ఏఓర్టిక్ అన్యూరిజమ్ ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. ఆమెకు EVAR (ఎండోవాస్క్యులర్ అన్యూరిజమ్ రిపేర్) విధానంలో చికిత్స అందించినట్లు చెప్పారు. రక్తనాళం ద్వారా స్టెంట్ గ్రాఫ్ట్‌ను పంపించి అన్యూరిజమ్‌ను రక్తప్రసరణ నుంచి వేరు చేయడం ద్వారా చికిత్స పూర్తి చేశామని, దీంతో సంప్రదాయ ఓపెన్ సర్జరీ అవసరం లేకుండా చికిత్స సాధ్యమైందని వివరించారు. రెండో కేసులో వృద్ధుడికి రప్చర్‌కు చేరువలో ఉన్న థొరాకోఅబ్డామినల్ ఏఓర్టిక్ అన్యూరిజమ్ ఉన్నట్లు గుర్తించామని డాక్టర్ భవానీ శంకర్ తెలిపారు. ఇది అత్యంత క్లిష్టమైన, అధిక ప్రమాదంతో కూడిన పరిస్థితి అని చెప్పారు. అంతేకాకుండా ఆయనకు ట్రిపుల్ వెసెల్ కరోనరీ ఆర్టరీ డిసీజ్ ఉండటంతో సీఏబీజీ చేయించుకోవాలని వైద్యులు సూచించారని తెలిపారు. మూత్రపిండాల పనితీరు కూడా దెబ్బతిని క్రియాటినిన్ స్థాయిలు పెరగడంతో పాటు, తొలుత సెప్సిస్‌తో హాస్పిటల్‌కు వచ్చినట్లు వివరించారు. ఒమేగా అనులోని మల్టీడిసిప్లినరీ వైద్య బృందం సమగ్రంగా పరిశీలించి, అవసరమైన వైద్య చికిత్సతో ఆయన పరిస్థితిని స్థిరీకరించిన అనంతరం TEVAR (థొరాసిక్ ఎండోవాస్క్యులర్ ఏఓర్టిక్ రిపేర్) విధానంలో బృహద్ధమని సమస్యకు విజయవంతంగా చికిత్స అందించామని తెలిపారు. వివిధ వయసులు, విభిన్న ఆరోగ్య పరిస్థితులు కలిగిన ఈ ఇద్దరు రోగులకు విజయవంతంగా చికిత్స అందించడం ద్వారా సంక్లిష్టమైన బృహద్ధమని వ్యాధుల నిర్వహణలో ఆధునిక ఎండోవాస్క్యులర్ విధానాల ప్రాధాన్యతను చాటిచెప్పామని పేర్కొన్నారు. గతంలో సంక్లిష్టమైన బృహద్ధమని, రక్తనాళాల సమస్యలకు ప్రత్యేక చికిత్సల కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి మహానగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని డాక్టర్ భవానీ శంకర్ తెలిపారు. ప్రస్తుతం ఒమేగా అను హాస్పిటల్‌లో అధునాతన ఇంటర్వెన్షనల్ రేడియాలజీ సేవలు అందుబాటులోకి రావడంతో సంక్లిష్టమైన మినిమల్లీ ఇన్వేసివ్ చికిత్సలను నగరంలోని అత్యంత నైపుణ్యంతో, తక్కువ ఖర్చులో అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. మినిమల్లీ ఇన్వేసివ్ విధానంలో సురక్షితంగా చికిత్స అందించే అవకాశం ఉన్న సందర్భాల్లో పెద్ద శస్త్రచికిత్సను నివారించి, ఆధునిక చికిత్సను అందిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్వెన్షనల్ రేడియాలజీ కేవలం సాధారణ రక్తనాళ సమస్యలకు మాత్రమే పరిమితం కాదని డాక్టర్ భవానీ శంకర్ అన్నారు. తల నుంచి పాదాల వరకు అనేక సంక్లిష్ట రక్తనాళ, ఇతర సమస్యలకు మినిమల్లీ ఇన్వేసివ్ చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వైద్య సాంకేతికతలో వచ్చిన పురోగతితో గతంలో ప్రధానంగా శస్త్రచికిత్స ద్వారా చికిత్స చేసిన అనేక సమస్యలను, ఎంపిక చేసిన రోగుల్లో ఎండోవాస్క్యులర్, ఇమేజ్‌గైడెడ్ మినిమల్లీ ఇన్వేసివ్ విధానాల ద్వారా నిర్వహించే అవకాశం ఏర్పడిందన్నారు. ఫైబ్రాయిడ్లు, థైరాయిడ్ నోడ్యూల్స్, ఆస్టియోఆర్థరైటిస్ కారణంగా వచ్చే మోకాలి నొప్పి, డీప్ వీన్ థ్రాంబోసిస్ (DVT), స్ట్రోక్ తదితర వాస్క్యులర్, నాన్‌వాస్క్యులర్ సమస్యలకు కూడా రోగి పరిస్థితిని బట్టి ఇంటర్వెన్షనల్ రేడియాలజీ ద్వారా చికిత్స అందించవచ్చన్నారు. ఈ అధునాతన చికిత్సా విధానాలు నగరంలోని ఒమేగా అను హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హాస్పిటల్‌లోని ఇంటర్వెన్షనల్ రేడియాలజీ విభాగంలో తల నుంచి పాదాల వరకు వివిధ సంక్లిష్ట వాస్క్యులర్, న్యూరోవాస్క్యులర్, ఇతర మినిమల్లీ ఇన్వేసివ్ ఇమేజ్‌గైడెడ్ చికిత్సలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్లిష్టమైన కేసుల నిర్వహణలో సమన్వయంతో సేవలందించిన కార్డియాలజీ, అనస్థీషియా, నర్సింగ్ బృందాలతో పాటు ఇతర సహాయక విభాగాల సిబ్బందిని డాక్టర్ భవానీ శంకర్ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే, ఒమేగా అను హాస్పిటల్‌లో అధునాతన వాస్క్యులర్, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ సేవల అభివృద్ధికి నిరంతరం మద్దతు, ప్రోత్సాహం అందిస్తున్న చైర్మన్ డాక్టర్ జి. రమేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



వైభవంగా గరుడ సేవ

# పోటెత్తిన భక్తజనం

* శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో విశిష్టమైనది గరుడ సేవ
* గరుడ వాహనంపై భక్తులను కటాక్షించిన మలయప్ప స్వామి
* లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో కిక్కిరిసిన మాడ వీధులు
* గోవింద నామస్మరణలతో మార్మోగిన తిరుమల కొండ
* భక్తుల కోసం టీటీడీ భారీ ఏర్పాట్లు, నిరంతర పర్యవేక్షణ



తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన గరుడ వాహన సేవ శనివారం రాత్రి అంగరంగ వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. గరుత్మంతునిపై శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువైన శ్రీ మలయప్పస్వామి వారు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ లక్షలాది మంది భక్తులకు అభయమిచ్చారు. ఈ అపురూప దృశ్యాన్ని కనులారా వీక్షించేందుకు తరలివచ్చిన భక్తుల "గోవిందా.. గోవిందా.." నామస్మరణలతో సప్తగిరులు మార్మోగాయి. శనివారం సాయంత్రం 6:30 గంటలకు వాహన మండపం నుంచి గరుడ వాహనంపై స్వామివారు బయటకు రాగానే, మాడ వీధుల్లోని గ్యాలరీలలో వేచి ఉన్న భక్తుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గజరాజులు ముందు నడుస్తుండగా, భజన బృందాలు, కోలాటాలు, జీయంగార్ల ఘోష్టి, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకుని పులకించిపోయారు.

*** భక్తులతో కిక్కిరిసిన మాడ వీధులు**

గరుడ సేవను తిలకించేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. మాడ వీధుల్లోని 1.90 లక్షల మంది సామర్థ్యం గల గ్యాలరీలు శుక్రవారం రాత్రికే భక్తులతో కిక్కిరిసిపోయాయి. గ్యాలరీలలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ శనివారం ఉదయం నుంచే పాలు, అన్నప్రసాదాలు, తాగునీరు, అల్పాహారం వంటివి నిరంతరాయంగా అందించింది. సుమారు 2000 మంది శ్రీవారి సేవకులు ఈ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు సేవలందించారు.

*** టీటీడీ ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ**

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి స్వయంగా మాడ వీధుల్లో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జేఈవోలు శరత్, గోపీనాథ్ శిలాతోరణం వద్ద క్యూలైన్లలోని భక్తులకు అందుతున్న అన్నప్రసాదం, నీటి సరఫరాను పరిశీలించారు. సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. సుమారు 600 మంది టీటీడీ ఉద్యోగులు తిరుమలలోని 8 కీలక ప్రాంతాల్లో సెక్టోరల్ అధికారులుగా విధులు నిర్వర్తించారు. వైష్ణవ సంప్రదాయంలో గరుడ సేవకు విశిష్ట ప్రాధాన్యం ఉంది. జ్ఞాన, వైరాగ్యాలకు ప్రతీక అయిన గరుత్మంతునిపై ఉన్న స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ అద్భుతమైన కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, పలువురు టీటీడీ బోర్డు సభ్యులు, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అర్ధాంగి వసుంధర దేవి కూడా ఈ వేడుకకు హాజరయ్యారు.



# నారా బ్రాహ్మణి చేతుల మీదుగా WAPL ట్రోఫీ ఆవిష్కరణ
















ఆంధ్రప్రదేశ్‌లో మహిళా క్రికెట్‌కు కొత్త శకం మొదలైంది. రాష్ట్రంలోని యువ క్రీడాకారిణుల ప్రతిభను వెలుగులోకి తెచ్చి, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాణించేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఏపీఎల్) తొలి సీజన్ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ వేడుకకు హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి ముఖ్య అతిథిగా విచ్చేసి, టోర్నమెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, ఈ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న మిథాలీ రాజ్‌తో కలిసి ఆమె ట్రోఫీని ఆవిష్కరించారు. అంతకుముందు, స్టేడియం ప్రాంగణానికి చేరుకున్న నారా బ్రాహ్మణికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఏసీఏ కార్యదర్శి, రాజ్యసభ ఎంపీ సానా సతీశ్ బాబు ఘనస్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసిన బ్రాహ్మణి, మిథాలీ రాజ్‌తో కలిసి డబ్ల్యూఏపీఎల్ ట్రోఫీని ఆవిష్కరించి క్రీడా స్ఫూర్తిని చాటారు. ఈ సందర్భంగా నారా బ్రాహ్మణి మాట్లాడుతూ, మహిళల కోసం ప్రత్యేకంగా ఇలాంటి ఒక ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇది రాష్ట్రంలోని యువ మహిళా క్రికెటర్లు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి ఒక అద్భుతమైన వేదిక అని అభివర్ణించారు. సరైన అవకాశం లభిస్తే మహిళలు ఏ రంగంలోనైనా అద్భుతాలు సృష్టిస్తారని, ఈ లీగ్‌లో రాణించే క్రీడాకారిణులు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా (రోల్ మోడల్స్‌గా) నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళగిరి వేదికగా ఇంత మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఏసీఏ అధ్యక్షుడు కేశినేని నాని, కార్యదర్శి సానా సతీశ్ బాబు, ఇతర నిర్వాహకులకు ఆమె ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులైన యువ మహిళా క్రికెటర్లను గుర్తించి, వారికి మెరుగైన శిక్షణ, అవకాశాలు కల్పించడమే డబ్ల్యూఏపీఎల్ ప్రధాన లక్ష్యం. ఇక్కడ రాణించిన వారిని జాతీయ స్థాయిలో జరిగే ఉమెన్ ప్రీమియర్ లీగ్ (WPL), భారత మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికయ్యేలా ప్రోత్సహించాలన్నది ఏసీఏ సంకల్పం. ఈ లక్ష్యానికి మరింత బలాన్ని చేకూరుస్తూ, భారత క్రికెట్ దిగ్గజం మిథాలీ రాజ్ ఈ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించడం విశేషం. ఆమె స్ఫూర్తితో యువ క్రీడాకారిణులు మరింత ఉత్సాహంగా రాణిస్తారని నిర్వాహకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఫ్రాంచైజీ పద్ధతిలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ టీ20 టోర్నమెంట్‌లో మొత్తం నాలుగు జట్లు పోటీపడుతున్నాయి. ఇందులో రాయలసీమ జెన్ స్టార్స్, గోదావరి ఈగల్స్, అమరావతి ఈఛాంపియన్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్ జట్లు ఉన్నాయి. మంగళగిరిలోని ఏసీఏ స్టేడియం వేదికగా ఏడు రోజుల పాటు మొత్తం 13 మ్యాచ్‌లు జరగనున్నాయి. శనివారం మధ్యాహ్నం రాయలసీమ జెన్ స్టార్స్, గోదావరి ఈగల్స్ మధ్య తొలి మ్యాచ్ జరగగా, సాయంత్రం ప్రారంభోత్సవం అనంతరం అమరావతి ఈఛాంపియన్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్ మధ్య రెండో మ్యాచ్ నిర్వహించారు. ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నారా బ్రాహ్మణిని నిర్వాహకులు ప్రత్యేక జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు, ఏసీఏ కోశాధికారి దండమూడి శ్రీనివాస్, అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు డి. విష్ణుతేజ, క్రికెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ కల్యాణ్ కృష్ణ, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు వైఎస్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టాలీవుడ్ భామ నిధి అగర్వాల్ కూడా సందడి చేశారు.

# స్థానిక ఎన్నికల్లో కూటమిదే విజయం.. 100 శాతం స్ట్రైక్ రేట్ ఖాయం: నాదెండ్ల

* పవన్ కల్యాణ్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నారని వెల్లడి



రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయదుందుభి మోగిస్తుందని, వందకు వంద శాతం స్ట్రైక్ రేట్‌తో విజయాలు సాధిస్తామని ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ ధీమా వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో ఈరోజు పర్యటించిన ఆయన పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమై మాట్లాడారు. అభ్యర్థుల ఎంపికలో ఏవైనా పొరపాట్లు లేదా సమస్యలు ఎదురైతే వెంటనే పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ, స్థానిక వార్డుల వారీగా బలమైన నాయకత్వాన్ని సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్ని సీట్లలో పోటీ చేస్తున్నామనే సంఖ్య కంటే, గెలిచే బలం ఉన్న స్థానాల్లో నిలబడి కచ్చితమైన విజయం సాధించడమే ప్రాధాన్యమని స్పష్టం చేశారు. జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇవాళ్టి నుంచి పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రానున్నారని నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. రాజకీయాల్లో అనుభవమే అసలైన పాఠమని పేర్కొంటూ, జీవీఎంసీ పరిధిలో గతంలో గెలిచిన, రెండో స్థానంలో నిలిచిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేవలం టికెట్ వస్తే సరిపోదని... ప్రజల అవసరాలు, స్థానిక సమస్యల పరిష్కారం కోసం కేడర్ నిరంతరం శ్రమించాలని నిర్దేశించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఐక్యత వల్లే రాష్ట్రంలో పెట్టుబడిదారులకు కొండంత భరోసా లభించిందని, ఉత్తరాంధ్రకు వస్తున్న భారీ ప్రాజెక్టులే దీనికి నిదర్శనమని చెప్పారు.

# విశాఖ బీచ్‌లో మిక్చర్ రుచి చూసిన చంద్రబాబు.. ఫొటోలు

- **విశాఖ ఆర్‌కే బీచ్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు**
- **సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించే మత్స్యకారులకు ప్రోత్సాహకాలు అందజేత**
- **మ్యాన్‌హోళ్లు శుభ్రం చేసే ఆధునిక రోబో పనితీరును పరిశీలించిన ముఖ్యమంత్రి**
- **మురి మిక్చర్ విక్రయించే ఒంటరి మహిళకు పెన్షన్ మంజూరు చేయాలని ఆదేశం**

ముఖ్యమంత్రి హోదాలో అధికారిక కార్యక్రమానికి వెళ్లినా, ప్రజల కష్టసుఖాలు తెలుసుకోవడంలో చంద్రబాబు తనదైన శైలిని ప్రదర్శించారు. విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో పర్యటన సందర్భంగా సాగర తీరంలో ఓ సాధారణ మహిళ విక్రయిస్తున్న మురి మిక్చర్ (మసాలా మిక్చర్) రుచి చూశారు. ఆ తర్వాత ఆమె జీవనోపాధి గురించి ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. తాను ఒంటరి మహిళనని, ఈ వ్యాపారమే జీవనాధారమని ఆమె చెప్పడంతో సీఎం తక్షణమే స్పందించారు. ఆమెకు వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఊహించని ఈ పరిణామంతో ఆ మహిళ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అంతకుముందు, ముఖ్యమంత్రి చంద్రబాబు 'స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఆర్కే బీచ్‌లో జీవీఎంసీ చేపట్టిన 'సాగర స్వచ్ఛత' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సముద్ర తీరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చేపడుతున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెదజాలరిపేటలో ఏర్పాటు చేసిన 'ఓషన్ ప్లాస్టిక్ రికవరీ సెంటర్' పైలట్ సైట్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా సముద్రంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి, రీసైక్లింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయనున్నారు. పర్యటనలో భాగంగా సముద్రంలో వ్యర్థాలను సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, మత్స్యకారులు, స్కూబా డైవర్లతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. చేపల వేటతో పాటు సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడం ద్వారా తమకు ప్రోత్సాహకాల రూపంలో అదనపు ఆదాయం వస్తోందని మత్స్యకారులు సీఎంకు వివరించారు. సేకరించిన వ్యర్థాలను డిజిటల్ పద్ధతిలో తూకం వేయడాన్ని చంద్రబాబు పరిశీలించి, మత్స్యకారులకు ప్రోత్సాహకాలను అందజేశారు. సముద్ర గర్భంలో పేరుకుపోయిన ప్లాస్టిక్, పాత వలలను ఎలా తొలగిస్తున్నారో స్కూబా డైవర్లను అడిగి తెలుసుకున్నారు. సాగర స్వచ్ఛతలో భాగంగా మొత్తం 1,200 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడమే లక్ష్యమని అధికారులు సీఎంకు వివరించారు. అనంతరం మ్యాన్‌హోళ్లు, మురుగు కాల్వల శుభ్రత కోసం జీవీఎంసీ అందుబాటులోకి తెచ్చిన ఆధునిక సీవరేజ్ రోబో పనితీరును ప్రదర్శనశాలలో పరిశీలించారు. జీవీఎంసీ చేపట్టిన సాగర స్వచ్ఛత ప్రాజెక్టుకు లభించిన అంతర్జాతీయ గుర్తింపు, భవిష్యత్ కార్యాచరణపై బ్లూమ్‌బెర్గ్ సంస్థ ప్రతినిధులతో చర్చించారు. మొత్తంగా ఈ పర్యటనలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూనే, సామాన్య ప్రజల సమస్యలపై సీఎం చూపిన శ్రద్ధ ప్రత్యేకంగా నిలిచింది.











## సుప్రీంకోర్టును..
# ఆశ్రయించిన దానం నాగేందర్

హైదరాబాద్: హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దానం నాగేందర్ ఇవాళ మధ్యాహ్నం సుప్రీంకోర్టు లో ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు అనుమతిస్తుందా? లేదా? అనేది వేచిచూడాల్సి ఉంది. సర్వోన్నత న్యాయస్థానం ఎప్పుడు విచారణకు స్వీకరిస్తుందనే విషయంపైనా స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ దానం నాగేందర్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించి అప్పీలు దాఖలుకు అనుమతిస్తే.. హైకోర్టు తీర్పుపై దానం నాగేందర్ అప్పీలు చేసే అవకాశం ఉంటుంది. ఇదే కేసులో ఇప్పటికే భాజపా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్



ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కేవియట్ దాఖలు చేశారు. భారాస తరఫున ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎన్నికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం నాగేందర్‌పై హైకోర్టు శుక్రవారం అనర్హత వేటు వేసింది. 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హత అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది. ఆయనపై దాఖలైన అనర్హత పిటిషన్‌లను కొట్టివేస్తూ స్పీకర్ వెలువరించిన తీర్పులను రద్దు చేస్తూ హైకోర్టు 91 పేజీల తీర్పు వెలువరించింది. స్పీకర్ తీర్పును రద్దు చేయాలని కోరుతూ భారాస, భాజపాలు దాఖలు చేసిన పిటిషన్‌లను అనుమతించింది. భారాస సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థిగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసినందున రాజ్యాంగంలోని పదో షెడ్యూలు పేరా 2(1)(ఎ) రెడ్‌విత్ 191(2) ప్రకారం దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తున్నట్లు పేర్కొంది. అనర్హత నేపథ్యంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్లు పరిగణనలోకి తీసుకోవాలంది. ఈ ఉత్తర్వుల ప్రతిని స్పీకర్ కార్యదర్శికి, ఎన్నికల సంఘానికి పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది.




# సొంత నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన.. సోమవారం నుంచే!

- **పిఠాపురంలో రూ. 1,500 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్న పవన్ కళ్యాణ్**
- **రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**
- **రూ. 200 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్‌కు శ్రీకారం**
- **మహిళా సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలు, మత్స్యకారులకు ఆధునిక పరికరాల పంపిణీ**
- **తాగునీటి పథకాలు, రోడ్ ఓవర్ బ్రిడ్జి వంటి కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన**

ఏపీ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ తన నియోజకవర్గ అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పిఠాపురాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో, సుమారు రూ. 1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి పలు




శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. పర్యటనలో భాగంగా సోమవారం, రూ. 9.59 కోట్లతో ఆధునికీకరించిన నాగులాపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని పవన్ కల్యాణ్ ప్రజలకు అంకితం చేయనున్నారు. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పథకం ద్వారా చివరి గ్రామాలకు నీరు అందడం లేదన్న సమస్యకు ఈ ఆధునికీకరణతో పరిష్కారం లభించనుంది. దీని ద్వారా 52 ఆవాసాల్లోని సుమారు 97 వేల మందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. దీంతో పాటు, పిఠాపురం పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం కోసం ఏర్పాటు చేసిన 'పీఠికాపుర వనం', చందుర్తితాటిపర్తి బీటీ రోడ్డును కూడా ఆయన ప్రారంభించనున్నారు. మంగళవారం నిర్వహించే బహిరంగ సభలో నియోజకవర్గ రూపురేఖలు మార్చే కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. పిఠాపురం ప్రజల చిరకాల వాంఛ అయిన రూ. 200 కోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్, రూ. 118 కోట్లతో రోడ్ ఓవర్ బ్రిడ్జి, రూ. 323 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ వంటి భారీ పనులకు ఆయన శ్రీకారం చుడతారు. వీటితో పాటు జల్ జీవన్ మిషన్, అమృత్ 2.0 పథకాల కింద పలు తాగునీటి ప్రాజెక్టులకు కూడా పచ్చజెండా ఊపనున్నారు. ఈ అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ కార్యక్రమాలకు కూడా పవన్ ప్రాధాన్యత ఇస్తున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలను అందజేయనున్నారు. ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారులకు ఆధునిక లైఫ్ జాకెట్లు, డ్రై ఫిష్ యూనిట్లు, ఐస్ బాక్సులతో కూడిన మోటార్ సైకిళ్లను పంపిణీ చేసి వారి జీవనోపాధికి భరోసా కల్పించనున్నారు. అదేవిధంగా, 89 మంది లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ పట్టాలు అందించి వారి భూములపై హక్కులు కల్పించనున్నారు. ఈ రెండు రోజుల పర్యటన ద్వారా నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పవన్ కల్యాణ్ పటిష్ఠమైన పునాదులు వేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: వరంగల్ ఎయిర్ పోర్టు కు పేరు సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రభుత్వం కృషితో వరంగల్ విమానాశ్రయం కల సాకారం కాబోతోందన్నారు. బీఆర్ఎస్ నేతలు పదేళ్లపాటు కుటుంబ ప్రయోజనాలు, విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లపైనే దృష్టి పెట్టారు తప్ప.. వరంగల్ విమానాశ్రయం సాధించటంపై దృష్టి సారించలేదని విమర్శించారు. విమానాశ్రయం భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయించడంతో పాటు.. అవసరమైన భూమిని సేకరించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించడంతో క్షేత్రస్థాయిలో కల రూపుదిద్దుకుంటోందన్నారు. ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని.. పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, పెట్టుబడులకు కొత్త గేట్‌వే అని సీఎం అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానించబడిన తెలంగాణకు కొత్త చిహ్నంగా నిలవనున్న వరంగల్ మామునూరు విమానాశ్రయం నుంచి ప్రయాణించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు చేపడుతున్న చర్యలు కీలక దశకు చేరుకున్నాయి. అనుమతుల దగ్గర నుంచి భూసేకరణ, సాంకేతిక పరమైన పరిశీలన దశలను దాటుకొని నిర్మాణ పనులను మూడు ప్యాకేజీలుగా చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. ఇప్పటికే రెండు ప్యాకేజీల పనులకు వేర్వేరుగా టెండర్లు పిలిచి ప్రక్రియను పూర్తి చేసిన విషయం తెలిసిందే. విమానాశ్రయం నిర్మాణాలు జరిగే ప్రాంగణం 953 ఎకరాల చుట్టూ ప్రహరీ నిర్మాణం తొలి ప్యాకేజీలో చేపట్టనున్నారు. రన్‌వే, ఆవరణలో పార్కింగ్, సీవరేజ్ వ్యవస్థ నిర్మాణ పనులను రెండో ప్యాకేజీలో ప్రతిపాదించారు. ఇక ఆఖరు



ప్యాకేజీ పనులైన టెర్మినల్ భవనం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్, ఫైర్ స్టేషన్, విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణాలను రూ.213.59 కోట్లతో చేపట్టనున్నారు. ఈ పనులకు సంబంధించి తాజాగా టెండర్లు పిలిచి నవంబరు నాటికి పూర్తయ్యేలా కార్యాచరణను సిద్ధం చేశారు. డిసెంబరులో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయనున్నట్లు ఏఏఐ వర్గాల ద్వారా తెలిసింది.

# ఎర్రవల్లి భూముల సర్వేలో మరో మలుపు

ఎర్రవల్లి: సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం ఎర్రవల్లిలో భూముల సర్వే మరో మలుపు తిరిగింది. కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలోని 325 సర్వే నెంబరులో 388 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. అయితే, ఈ భూముల్లో తమకూ వాటా ఉందంటూ శివారు వెంకటాపూర్ గ్రామస్థులు ఆందోళనకు దిగారు. 388 ఎకరాల్లో ఎర్రవల్లి గ్రామస్థులకు 250 ఎకరాలు మాత్రమే ఉందని, మిగిలిన భూమిలో తమకూ హక్కులు ఉన్నాయని వెంకటాపూర్ వాసులు చెబుతున్నారు. కాస్రా, సిత్వార్ రికార్డుల ఆధారంగా సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. గతంలో అధికారులు, సిబ్బంది చేసిన తప్పిదాల కారణంగానే భూ రికార్డుల్లో మార్పులు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో తమకు అన్యాయం జరగకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు.




**రైతులకు నోటీసులు ఇస్తున్న అధికారులు**

ఎర్రవల్లిలోని సర్వే నెంబరు 325లో వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు అధికారులు నోటీసులు ఇచ్చారు. విడతల వారీగా నోటీసుల ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం 215 మందికి నోటీసులు ఇవ్వాలని అధికారులు నిర్ణయించగా.. ఇవాళ 50మంది రైతులకు జారీ చేశారు. సర్వే నెంబరు 325లో ఈనెల 21 నుంచి 4 విడతల్లో సర్వే కొనసాగనుంది. 21వ తేదీన రైతులు భూమి వద్దకు వచ్చి వివరాలు తెలియజేయాలని నోటీసులో పేర్కొన్నారు.

# బ్రిక్స్ సదస్సుతో ప్రపంచ వేదికపై భారత్ స్థానం మరింత బలోపేతం!

- బ్రిక్స్ సదస్సు నిర్వహణలో భారత దౌత్యంపై డైరెక్టస్ ప్రత్యేక నివేదిక
- పహల్గామ్ ఉగ్రదాడిని ఖండించడంతో భారత వాదనలకు లభించిన మద్దతు
- క్వాడ్‌లో ఉంటూనే బ్రిక్స్‌లో కీలక పాత్ర పోషిస్తున్నట్లు 'డైరెక్టస్' ప్రస్తావన
- అమెరికాతో సంబంధాలు కొనసాగిస్తూ రష్యాతో భాగస్వామ్యం కీలకమని వ్యాఖ్య
- భిన్నమైన అభిప్రాయాలు ఉన్నప్పటికీ.. భారత్ తన భద్రతకు సంబంధించిన అంశాలను ప్రస్తావించిందని వెల్లడి



న్యూఢిల్లీ వేదికగా జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు తర్వాత అంతర్జాతీయ వేదికపై భారత్‌కు దౌత్యపరమైన ప్రాధాన్యం మరింత స్పష్టమైందని 'డైరెక్టస్' నివేదిక పేర్కొంది. ముఖ్యంగా 2025 పహల్గామ్ ఉగ్రదాడిని బ్రిక్స్ న్యూఢిల్లీ డిక్లరేషన్‌లో తీవ్రంగా ఖండించడం, సరిహద్దు దాటి ఉగ్రవాదుల కదలికలు, ఉగ్రవాదానికి నిధులు, సురక్షిత స్థావరాలకు వ్యతిరేకంగా స్పష్టమైన వైఖరి తీసుకోవడం భారత్ చాలాకాలంగా ప్రస్తావిస్తున్న అంశాలకు మద్దతు లభించినట్లయిందని తెలిపింది. పహల్గామ్ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఉగ్రవాదాన్ని ఏ రూపంలో ఉన్నా నేరపూరితమైనదిగా, సమర్థించలేనిదిగా పేర్కొన్నాయి. ఉగ్రవాద చర్యలకు పాల్పడినవారితో పాటు వారికి మద్దతు ఇచ్చేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూడా డిక్లరేషన్ స్పష్టం చేసింది. అయితే డిక్లరేషన్‌లో పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించలేదు. ఈ అంశాన్ని దాచాల్సిన అవసరం లేదని, అదే సమయంలో అతిగా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం కూడా లేదని 'డైరెక్టస్' పేర్కొంది. వివిధ భౌగోళిక, రాజకీయ ప్రయోజనాలు ఉన్న దేశాలు కలిసి ఉగ్రవాదంపై ఇలాంటి భాషను అంగీకరించడం భారత్‌కు దౌత్యపరంగా ముఖ్యమైన పరిణామమని విశ్లేషించింది. ఉగ్రవాదాన్ని కేవలం దాడి చేసిన వ్యక్తితో మాత్రమే పరిమితం చేయలేమని నివేదిక పేర్కొంది. ఆయుధాలు, శిక్షణ, నిధులు, సమాచార వ్యవస్థలు, నియామక నెట్‌వర్క్‌లు, సురక్షిత ప్రాంతాల వంటి మొత్తం వ్యవస్థపై చర్యలు అవసరమని తెలిపింది. ఈ అంశాలపై బ్రిక్స్ డిక్లరేషన్‌లో వచ్చిన ప్రస్తావన ప్రాధాన్యమైనదని పేర్కొంది. అదే సమయంలో భారత్ అనుసరిస్తున్న బహుముఖ విదేశాంగ విధానాన్ని కూడా నివేదిక ప్రస్తావించింది. అమెరికాతో సంబంధాలను విస్తరిస్తూనే రష్యాతో భాగస్వామ్యాన్ని భారత్ కొనసాగిస్తోంది. క్వాడ్‌లో సభ్యత్వంతో పాటు బ్రిక్స్‌లో కీలక పాత్ర పోషిస్తోంది. చైనాతో విభేదాలు ఉన్నప్పటికీ.. జాతీయ ప్రయోజనాలకు అవసరమైన చోట ఆ దేశంతో చర్చలు కొనసాగిస్తోంది. వివిధ దేశాల మధ్య భిన్నమైన అభిప్రాయాలు ఉన్నప్పటికీ.. భారత్ తన భద్రతకు సంబంధించిన అంశాలను బ్రిక్స్ వంటి వేదికపై చర్చకు తీసుకురాగలిగిందని 'డైరెక్టస్' విశ్లేషించింది. దీనివల్ల ఏ ఒక్క భౌగోళిక రాజకీయ కూటమిపై ఆధారపడకుండా స్వతంత్రంగా వ్యవహరించే దేశంగా భారత్ తన దౌత్యపరమైన స్థాయిని మరింత స్పష్టంగా చూపించిందని నివేదిక పేర్కొంది.




## పాక్ కదలికలపై ఇక 24 గంటల నిఘా.. ఈఓఎస్-05తో మారనున్న పరిస్థితులు?

- ఈఓఎస్-05తో ఉపఖండంపై నిరంతర నిఘా సాధ్యమన్న నివేదిక
- పాక్ సైనిక కదలికలను గమనించే సామర్థ్యం పెరగనుందని వెల్లడి
- ఈఓఎస్-05ను సెప్టెంబర్ 4న భూస్థిర కక్ష్యలోకి పంపిన భారత్
- వ్యూహాత్మక సమాచారాన్ని అందించనున్న ఉపగ్రహం
- నిరంతర నిఘాతో వేగవంతం కానున్న లక్ష్యాల గుర్తింపు



భారత్ అంతరిక్ష రంగంలో మరో కీలక అడుగు వేసింది. భూస్థిర కక్ష్యలోకి పంపిన ఈఓఎస్ 05 ఉపగ్రహం దేశానికి నిరంతర నిఘా సామర్థ్యాన్ని అందించనుందని 'ద డిప్లొమాట్' నివేదిక పేర్కొంది. ముఖ్యంగా సంక్షోభ సమయంలో పాకిస్థాన్ నౌకలు, విమానాలు, వ్యూహాత్మక వనరులు, సైనిక బలగాల కదలికలను ఎప్పటికప్పుడు గమనించే అవకాశం భారత్‌కు లభించనుందని తెలిపింది. సెప్టెంబర్ 4న జీఎస్ఎల్‌వీఎఫ్17 రాకెట్ ఈఓఎస్05ను భూస్థిర కక్ష్యలోకి చేర్చింది. భూమికి దాదాపు 34,900 నుంచి 35,900 కిలోమీటర్ల ఎత్తులో ఉండే ఈ కక్ష్యతో భారత ఉపఖండంపై నిరంతర నిఘా కొనసాగించవచ్చు. ఈ ఉపగ్రహం ద్వారా దేశానికి వ్యూహాత్మక సమాచారాన్ని అందించే తొలి ప్రత్యేక ఇమేజింగ్ ఉపగ్రహంగా ఈఓఎస్05 నిలుస్తుందని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. భారత్ ఇప్పటికే పలు నిఘా ఉపగ్రహాలను దిగువ భూకక్ష్యలో ఉపయోగిస్తోంది. ఇవి అత్యంత స్పష్టమైన చిత్రాలను అందిస్తాయి. అయితే అవి భూమి చుట్టూ వేగంగా తిరుగుతుండటంతో ఒక ప్రాంతాన్ని నిరంతరం గమనించడం సాధ్యం కాదు. ఈఓఎస్05 విషయంలో ఈ పరిమితి తగ్గనుంది. సైనిక కదలికలను నిరంతరం గమనించడం వల్ల లక్ష్యాన్ని గుర్తించిన తర్వాత దానిపై చర్య తీసుకునే సమయం తగ్గుతుందని నివేదిక తెలిపింది. కచ్చితమైన దాడులకు క్షిపణుల సామర్థ్యంతో పాటు లక్ష్యం ఎక్కడుందన్న తాజా సమాచారం కూడా కీలకమేనని పేర్కొంది. ఇదే సమయంలో భారత్ తన అంతరిక్ష నిఘా వ్యవస్థను మరింత విస్తరించే ప్రణాళికలో ఉంది. 2024లో కేంద్ర భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ 52 రక్షణ ఉపగ్రహాలను ప్రయోగించే స్పేస్ బేస్డ్ సర్వైలెన్స్3 కార్యక్రమానికి ఆమోదం తెలిపింది. వీటిలో 21 ఉపగ్రహాలను ఇస్రో, 31 ఉపగ్రహాలను ప్రైవేటు రంగం అభివృద్ధి చేయనున్నాయి.




## యూపీఐ పేమెంట్లు స్వీకరించబోం.. నగదు మాత్రమే!




దిల్లీ: కేంద్రం తీసుకొచ్చిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధానంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తాము యూపీఐ చెల్లింపులు స్వీకరించబోమని, నగదు మాత్రమే తీసుకుంటామని కొందరు వ్యాపారులు బోర్డులు పెడుతున్నారు. ఒకవేళ యూపీఐ పేమెంట్ చేస్తే అదనంగా చెల్లించాలంటున్నారు. దిల్లీ శివారులోని ఘజియాబాద్‌లో ఈ తరహా బోర్డులు ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. పెద్ద వ్యాపార సంస్థలు, ఇకామర్స్ సంస్థలతో (పీ2ఎం) చేసే రూ.2000కు మించిన లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ విధిస్తున్నట్లు కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. అక్టోబర్ 15 నుంచి దీనిని అమలు చేయనున్నారు. కాగా, దీనిపై వ్యాపారుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అదనపు ఖర్చును భరించేందుకు వారు ఇష్టపడటం లేదు. ఎండీఆర్ అమల్లోకి వచ్చిన తర్వాత వీలైనంత వరకు నగదునే చెల్లించాలని పెద్ద మొత్తంలో కొనుగోళ్లు చేసేవారిని ఇప్పటి నుంచే సిద్ధం చేస్తున్నారు.

## ఎమ్మెల్యే ఖాతా నుంచి రూ.1.55 లక్షలు చోరీ

సైబర్ కేటుగాళ్లు ఏకంగా ఎమ్మెల్యేనే బురిడీ కొట్టించారు. ఆమె బ్యాంకు ఖాతా నుంచి దశలవారీగా రూ.1.55 లక్షలు మాయం చేశారు. ఈ మేరకు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఎమ్మెల్యే పూజా పాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన యూనియన్ బ్యాంక్ ఖాతా నుంచి ఆగస్టు 22 నుంచి సెప్టెంబరు 13 మధ్య కాలంలో దశలవారీగా డబ్బు తీశారని పేర్కొన్నారు. తన ఫోన్‌ను ఎవరో హ్యాక్ చేసి ఫోన్ పే ద్వారా ఈ మోసానికి పాల్పడి ఉండొచ్చని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. పూజా పాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ (C-MET), హైదరాబాద్
ప్రకటన సం.: HD/02/Rectt/4/SP-48/2026

**ప్రాజెక్ట్ సిబ్బంది నియామకం**

**మొత్తం: 5 ఖాళీలు**

| పోస్ట్ | ఖాళీలు | అర్హత | వేతనం |
|---|---|---|---|
| ప్రాజెక్ట్ సైంటిస్ట్ | 1 (UR) | కెమికల్ ఇంజనీరింగ్, మెటలర్జీ & మెటీరియల్స్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, ఫిజిక్స్ లేదా మెటీరియల్స్ సైన్స్‌లో Ph.D. లేదా M.E./M.Tech తో 3 సంవత్సరాల పరిశోధన అనుభవం మరియు కనీసం 1 SCI జర్నల్ పరిశోధనా పత్రం | ₹67,000/నెల + 30% HRA + వైద్య ఖర్చుల కోసం 1 నెల ప్రాథమిక వేతనానికి సమానమైన మొత్తం |
| ప్రాజెక్ట్ స్టాఫ్ టెక్నికల్ | 3 (OBC: 2, SC: 1) | ఎలక్ట్రికల్, సివిల్ లేదా ఇన్స్ట్రుమెంటేషన్‌లో ఫస్ట్ క్లాస్ (60%) డిప్లొమా | ₹27,000/నెల + 30% HRA + వైద్య ఖర్చుల కోసం 1 నెల ప్రాథమిక వేతనానికి సమానమైన మొత్తం |
| ప్రాజెక్ట్ స్టాఫ్ అడ్మిన్ | 1 (UR) | ఫస్ట్ క్లాస్ (60%) B.Com / B.A. / B.Sc., అకౌంట్స్‌లో 2 సంవత్సరాల అనుభవం మరియు కంప్యూటర్ పరిజ్ఞానం (MS Office) | ₹27,000/నెల + 30% HRA + వైద్య ఖర్చుల కోసం 1 నెల ప్రాథమిక వేతనానికి సమానమైన మొత్తం |
| మొత్తం | 5 పోస్టులు | | |

వయోపరిమితి (ఇంటర్వ్యూ తేదీ నాటికి):
- ప్రాజెక్ట్ సైంటిస్ట్: గరిష్ఠంగా 40 సంవత్సరాలు
- ప్రాజెక్ట్ స్టాఫ్ టెక్నికల్: OBCకు గరిష్ఠంగా 31 సంవత్సరాలు, SCకు 33 సంవత్సరాలు
- ప్రాజెక్ట్ స్టాఫ్ అడ్మిన్: గరిష్ఠంగా 28 సంవత్సరాలు

ముఖ్యమైన తేదీలు:
- వాక్-ఇన్ ఇంటర్వ్యూ తేదీ: 22 సెప్టెంబర్ 2026 (మంగళవారం)
- రిజిస్ట్రేషన్ సమయం: ఉదయం 09:00 నుండి 10:00 వరకు

ఎంపిక ప్రక్రియ: వాక్-ఇన్ ఇంటర్వ్యూ (సర్టిఫికెట్ల పరిశీలన/ధృవీకరణ అనంతరం ఇంటర్వ్యూ).

ఉద్యోగ స్థలం: C-MET, చెర్లపల్లి, హైదరాబాద్, తెలంగాణ

దరఖాస్తు విధానం: దరఖాస్తు ఫారాన్ని పూరించి, ఒరిజినల్ పత్రాలు మరియు స్వీయ ధృవీకరించిన పత్రాలతో నేరుగా వాక్-ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలి.

అధికారిక వెబ్‌సైట్: www.cmet.gov.in

గమనిక:
- ఒరిజినల్ పత్రాలు, స్వీయ ధృవీకరించిన ఫోటోకాపీలు మరియు ఇటీవలి పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను తీసుకురావాలి.
- ఈ పోస్టులు పూర్తిగా తాత్కాలిక/కాంట్రాక్టు ప్రాతిపదికన ఉంటాయి (ప్రాజెక్ట్ వ్యవధి 05.03.2027 వరకు లేదా ప్రాజెక్ట్ ముగిసే వరకు, ఏది ముందైతే అది).

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పోలీస్ శాఖలో ఉద్యోగాలు
నోటిఫికేషన్ 2026 - 2,050 పోస్టులు

ఏపీలో పోలీసుశాఖలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. పోలీసు, ఫైర్, జైళ్లు, ఫోరెన్సిక్ విభాగాల్లో 2,050 పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు (APSLPRB) నోటిఫికేషన్ విడుదల చేసింది.

విభాగాల వారీగా పోస్టుల వివరాలు:

సబ్ ఇన్‌స్పెక్టర్ (సివిల్, AR, SPF)

| క్రమం | విభాగం / పోస్టు | ఖాళీలు |
|---|---|---|
| 1. | సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (సివిల్) (మెన్ & ఉమెన్) | 253 |
| 2. | రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (AR) (మెన్ & ఉమెన్) | 116 |
| 3. | సబ్ ఇన్‌స్పెక్టర్ (SPF) | 09 |
| | మొత్తం | 378 |

సబ్ ఇన్‌స్పెక్టర్ (కమ్యూనికేషన్స్ & PTO)

| క్రమం | విభాగం / పోస్టు | ఖాళీలు |
|---|---|---|
| 1. | సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (కమ్యూనికేషన్స్) (మెన్ & ఉమెన్) | 50 |
| 2. | సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (PTO) (మెన్) | 10 |
| | మొత్తం | 60 |

SCT PCలు (సివిల్)

| క్రమం | విభాగం / పోస్టు | ఖాళీలు |
|---|---|---|
| 1. | SCT PCs (సివిల్) (మెన్ & ఉమెన్) | 542 |
| 2. | SCT PCs (AR) (మెన్ & ఉమెన్) | 285 |
| 3. | ఫైర్‌మెన్ | 158 |
| 4. | వార్డర్స్ (మెన్) | 150 |
| 5. | వార్డర్స్ (ఉమెన్) | 21 |
| | మొత్తం | 1,156 |

ఫైర్ సిబ్బంది (FSL)

| క్రమం | విభాగం / పోస్టు | ఖాళీలు |
|---|---|---|
| 1. | సైంటిఫిక్ అసిస్టెంట్ (ఫిజికల్) | 10 |
| 2. | సైంటిఫిక్ అసిస్టెంట్ (కెమికల్) | 13 |
| 3. | సైంటిఫిక్ అసిస్టెంట్ (బయాలజీ/సెరాలజీ) | 20 |
| | మొత్తం | 43 |

సహాయక సిబ్బంది (PTO)

| క్రమం | విభాగం / పోస్టు | ఖాళీలు |
|---|---|---|
| 1. | SCT కానిస్టేబుల్ (మెకానిక్) | 15 |
| 2. | SCT కానిస్టేబుల్ (డ్రైవర్) | 198 |
| | మొత్తం | 213 |

ఇతర పోస్టులు

| క్రమం | విభాగం / పోస్టు | ఖాళీలు |
|---|---|---|
| 1. | సైంటిఫిక్ టెక్ కానిస్టేబుల్ (ఫిజికల్) | 10 |
| 2. | సైంటిఫిక్ టెక్ కానిస్టేబుల్ (కెమికల్) | 13 |
| 3. | సైంటిఫిక్ టెక్ కానిస్టేబుల్ (బయాలజీ/సెరాలజీ) | 20 |
| | మొత్తం | 43 |

మొత్తం ఖాళీలు 2,050
- దరఖాస్తు చేసుకోవాల్సిన వెబ్‌సైట్: slprb.ap.gov.in లో ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలి.
- అభ్యర్థులు తప్పనిసరిగా నోటిఫికేషన్‌ను పరిశీలించుకోగలరు.

సేవే లక్ష్యం.. భద్రత బాధ్యత..

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (APPSC), విజయవాడ
మొత్తం ఖాళీలు: 892
వెబ్ నోట్ తేదీ: 15.09.2026 | స్థలం: విజయవాడ

**వివిధ పోస్టులు - సంక్షిప్త నోటిఫికేషన్లు**

| క్రమ సంఖ్య | నోటిఫికేషన్ నం. | నోటిఫికేషన్ పేరు | తాత్కాలిక ఖాళీలు | ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు |
|---|---|---|---|---|
| 1 | 07/2026 | గ్రూప్-1 సర్వీసెస్ | 163 | 06.10.2026 to 27.10.2026 |
| 2 | 08/2026 | A.P. కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ | 40 | |
| 3 | 19/2026 | A.P. హార్టికల్చర్ సర్వీసులో హార్టికల్చర్ ఆఫీసర్ | 37 | |
| 4 | 11/2026 | A.P. స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ సర్వీసులో ఫోరెన్సిక్ ఇంజనీరింగ్ / ఫిజిక్స్ / కెమిస్ట్రీ / బయోలాజీలో అసిస్టెంట్ డైరెక్టర్ | 8 | |
| 5 | 25/2026 | BC సంక్షేమ శాఖలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-II | 29 | 09.10.2026 to 29.10.2026 |
| | | సాంఘిక సంక్షేమ శాఖలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-II | 21 | |
| | | గిరిజన సంక్షేమ శాఖలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-II | 23 | |
| 6 | 26/2026 | A.P. ట్రైబల్ వెల్ఫేర్ సర్వీసులో అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ | 6 | |
| | | A.P. సోషల్ వెల్ఫేర్ సర్వీసులో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ | 11 | |
| 7 | 20/2026 | A.P. ఎకనామిక్స్ & స్టాటిస్టికల్ సబ్‌ఆర్డినేట్ సర్వీసులో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ | 196 | 13.10.2026 to 02.11.2026 |
| 8 | 09/2026 | A.P. ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టికల్ సర్వీసులో అసిస్టెంట్ డైరెక్టర్ | 17 | |
| 9 | 10/2026 | A.P. ట్రైబల్ వెల్ఫేర్ సర్వీసులో అసిస్టెంట్ డైరెక్టర్ | 1 | |
| 10 | 14/2026 | A.P. ఫ్యాక్టరీస్ సర్వీసులో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ | 12 | |
| 11 | 21/2026 | A.P. కాలుష్య నియంత్రణ మండలిలో అనలిస్ట్ గ్రేడ్-II | 18 | |
| 12 | 22/2026 | A.P. లెజిస్లేచర్ సర్వీసెస్‌లో ఇంగ్లీష్ రిపోర్టర్లు | 10 | |
| | | A.P. లెజిస్లేచర్ సర్వీసెస్‌లో తెలుగు రిపోర్టర్లు | 1 | |
| 13 | 23/2026 | A.P. ఎండోమెంట్స్ సబ్‌ఆర్డినేట్ సర్వీసులో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్-III | 104 | 16.10.2026 to 05.11.2026 |
| 14 | 12/2026 | A.P. జువెనైల్ వెల్ఫేర్ కరెక్షనల్ సబ్ సర్వీసులో డిస్ట్రిక్ట్ ప్రొబేషన్ ఆఫీసర్ గ్రేడ్-II / ఇంటెక్ ప్రొటెక్షన్ ఆఫీసర్ | 15 | |
| 15 | 24/2026 | A.P. ఇండస్ట్రీస్ సబ్‌ఆర్డినేట్ సర్వీసులో ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్లు | 78 | |
| 16 | 13/2026 | A.P. మహిళా అభివృద్ధి & శిశు సంక్షేమ సబ్-ఆర్డినేట్ సర్వీసులో సూపర్వైజర్ గ్రేడ్-I | 29 | |
| 17 | 17/2026 | A.P. ఫారెస్ట్ సబ్‌ఆర్డినేట్ సర్వీసులో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ | 26 | |
| 18 | 15/2026 | A.P. ఫారెస్ట్ సబార్డినేట్ సర్వీసులో డ్రాఫ్ట్స్‌మన్ గ్రేడ్-II (టెక్నికల్ అసిస్టెంట్) | 20 | |
| 19 | 18/2026 | A.P. ఫారెస్ట్ సబ్‌ఆర్డినేట్ సర్వీసులో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ | 23 | |
| 20 | 16/2026 | A.P. ఫారెస్ట్ సర్వీసులో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు | 4 | |
| | | మొత్తం | 892 | |

ముఖ్యమైన సమాచారం
- ఖాళీలు, విద్యార్హతలు మరియు ఇతర వివరాలు తాత్కాలికం/ప్రొవిజనల్ మాత్రమే. పూర్తి వివరాలతో కూడిన వివరణాత్మక నోటిఫికేషన్లు తరువాత విడుదల చేయబడతాయి.
- అభ్యర్థులు తాజా సమాచారం కోసం APPSC అధికారిక వెబ్‌సైట్‌ను క్రమం తప్పకుండా చూడండి.

అధికారిక వెబ్‌సైట్ : psc.ap.gov.in






# ఆ పదవి నుంచి మంత్రిని తొలగించండి: ఆర్బీఐ

మహారాష్ట్ర మంత్రి బాబాసాహెబ్ పాటిల్‌తోపాటు మరో ఏడుగురిని లాతూర్ డీసీసీ బ్యాంక్ డైరెక్టర్ల పదవుల నుంచి తొలగించాలని భారతీయ రిజర్వ్ బ్యాంకు ఆదేశాలు జారీ చేసింది. పదేళ్ల పదవీకాల పరిమితిని మించిన నేపథ్యంలో ఈమేరకు చర్యలు తీసుకుంది. బాబాసాహెబ్ పాటిల్.. ఉప ముఖ్యమంత్రి సునేత్ర పవార్ నాయకత్వంలోని ఎన్సీపీకి చెందిన నేత. బ్యాంకు సభ్యుడు సతీశ్ జాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌పై బాంబే హైకోర్టు ఔరంగాబాద్ బెంచ్ జారీ చేసిన ఆదేశాల మేరకు



ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. బ్యాంకింగ్ చట్టాల ప్రకారం.. జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల (DCCBs) డైరెక్టర్ల పదవీకాలం గరిష్ఠంగా పదేళ్లు ఉంటుంది. ఈ ఏడాది మేలో సతీశ్ జాదవ్ ఇదే అంశాన్ని లేవనెత్తి.. లాతూర్ డీసీసీ బ్యాంక్‌కు చెందిన ఎనిమిది మంది డైరెక్టర్లను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ ఆర్బీఐ చీఫ్ జనరల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే.. ఆర్బీఐ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో.. జూన్‌లో బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఆరు వారాల్లోగా దీనిపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం ఆగస్టు 3న ఆదేశించడంతో.. ఆర్బీఐ ఈమేరకు చర్యలు తీసుకుంది.

## పోర్షే కంపెనీలో
# 4 వేలకు పైగా ఉద్యోగాల కోత!

జర్మనీకి చెందిన ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఫోక్స్‌వ్యాగన్ (Volkswagen) మరోసారి ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. తన అనుబంధ పోర్షేలో (Porsche) భారీగా లేఆఫ్స్ ప్రకటించనుంది. దాదాపు 4 వేలకు పైగా ఉద్యోగులకు ఉద్వాసన పలకనున్నట్లు జర్మనీకి చెందిన ఓ వార్తాపత్రిక వెల్లడించింది. ఆర్థిక పరమైన సమస్యలే ఇందుకు కారణంగా తెలుస్తోంది. పోర్షేలో సుమారు 4,100 మంది ఉద్యోగులను తొలగించాలని ఫోక్స్‌వ్యాగన్ సూపర్‌వైజరీ బోర్డు ప్రతిపాదించినట్లు సమాచారం. దాదాపు 803.8 మిలియన్ డాలర్ల (సుమారు రూ.7,715.81 కోట్లు) ఆర్థిక లోటును అధిగమించేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు సదరు పత్రిక పేర్కొంది. అయితే, జులై నెలలో కంపెనీ మేనేజ్‌మెంట్ ఇప్పటికే ప్రతిపాదించిన




9 వేల ఉద్యోగాల కోతలకు ఇవి అదనం అని తెలిపింది. చైనాలో కార్ల విక్రయాలు క్షీణించడం, ఎలక్ట్రిక్ వాహనాల వ్యూహంలో మార్పులు రావడంతో పోర్షే కంపెనీ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్ తమ వార్షిక లాభాల అంచనాలను కూడా గణనీయంగా తగ్గించుకోవడం గమనార్హం.

# మరోసారి బ్యాంకుల దేశవ్యాప్త సమ్మె.. ఖాతాదారులకు ఎస్‌బీఐ కీలక అలర్ట్!

బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బ్యాంకు యూనియన్లు మరోసారి దేశవ్యాప్త సమ్మెకు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (State Bank of India) తమ ఖాతాదారులకు కీలక అడ్వైజరీ (SBI advisory) జారీ చేసింది. సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (UFBU) సమ్మె ప్రతిపాదన విషయాన్ని గుర్తు చేసిన ఎస్‌బీఐ.. ఖాతాదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచిస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. సమ్మె కాలంలో అత్యవసర బ్యాంకింగ్ సేవలను అందించేందుకు తాము అన్ని విధాలా ప్రయత్నిస్తున్నామని తెలిపింది. నగదు అవసరాల కోసం ఏటీఎంలు, డిపాజిట్ వెండింగ్ మెషిన్లను వినియోగించుకోవాలని ఖాతాదారులకు సూచించింది. ప్రత్యామ్నాయంగా తమ కస్టమర్ సర్వీస్ పాయింట్లనూ వినియోగించుకోవాలని తెలిపింది. ఇంటర్నెట్ బ్యాంకింగ్, యోనో, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ, ఇతర డిజిటల్ వేదికలు యథావిధిగా అందుబాటులో ఉంటాయని




తెలిపింది. వినియోగదారులకు కలుగుతున్న అసౌకర్యానికి చింతిస్తున్నట్లు పేర్కొంది. వారానికి ఐదు రోజుల బ్యాంకింగ్ విధానం అమలు సహా పలు డిమాండ్లపై యూఎఫ్‌బీయూ ఈ నెల 11న సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే. ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగుల సమ్మెతో బ్యాంకు కార్యకలాపాలు దేశ వ్యాప్తంగా స్తంభించాయి. అయితే, తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో మరోసారి సమ్మె చేస్తామని గతంలోనే హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే 28 నుంచి మరోసారి ఉద్యోగులు సమ్మెకు సన్నద్ధమవుతున్నారు. అప్పటికీ కేంద్రం దిగిరాకపోతే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామంటూ ఇప్పటికే బ్యాంకు యూనియన్లు ప్రకటించాయి.

# 3 కంపెనీలను హ్యాక్ చేసిన జెమినై ఏఐ..!

అత్యాధునిక ఏఐ మోడళ్లతో సైబర్ భద్రతకు సవాళ్లు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఓపెన్‌ఏఐకి చెందిన కృత్రిమ మేధ ఏజెంట్ సైబర్ దాడికి పాల్పడినట్లు తెలిసింది. తాజాగా గూగుల్‌కు చెందిన ఏఐ మోడల్ 'జెమినై ఏఐ' కూడా 3 కంపెనీలను హ్యాక్ చేసింది. ఈ విషయాన్ని గూగుల్ ధ్రువీకరించింది. AI ఏజెంట్ల దాడి సామర్థ్యాలను అంచనా వేయడానికి ఈ సంస్థ ఇటీవల సైబర్ సెక్యూరిటీ వ్యవస్థను రూపొందించింది. దానిని పరీక్షిస్తున్న సమయంలో జెమినై తన నిర్దేశిత పరిధులను దాటి.. మూడు ఇతర కంపెనీలకు చెందిన డిజిటల్ సమాచారాన్ని హ్యాక్ చేసినట్లు సంస్థ వెల్లడించింది. ఈ తప్పిదాన్ని గుర్తించిన వెంటనే తమ ఏఐ సైబర్ సెక్యూరిటీ వ్యవస్థ పనిచేయడం దానంతట అదే ఆగిపోయిందని తెలిపింది. "సైబర్ సెక్యూరిటీ పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో ఇతర పాస్‌వర్డ్‌లను ఊహించి జెమినై ఏఐ బహిరంగ వెబ్ నుంచి మరో మూడు కంపెనీల డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలోకి అనధికారికంగా ప్రవేశించింది. ఈ హ్యాకింగ్ వల్ల ప్రభావిత కంపెనీల డేటాకు ఎటువంటి హాని జరగలేదని ధ్రువీకరించుకున్నాం. ఈ విషయంలో మా ఏఐ బాధ్యతాయుతంగా వ్యవహరించింది. హ్యాకింగ్ వల్ల ప్రభావితమైన సంస్థలను ఇప్పటికే సంప్రదించాం. ఆయా సంస్థలు బలహీనమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించడం వల్ల ఈ సమస్య తలెత్తింది. శక్తిమంతమైన ఏఐ నమూనాలు బాధ్యతాయుతంగా ప్రవర్తించేలా వాటికి శిక్షణ ఇవ్వడం ఎంత ముఖ్యమో దీని ద్వారా తెలిసింది" అని గూగుల్ సెక్యూరిటీ ఇంజినీరింగ్ వైస్ ప్రెసిడెంట్ హీథర్ అడ్కిన్స్ వెల్లడించారు.

# డిస్నీ నూతన సీటీఓగా కరణ్‌దీప్ ఆనంద్



ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ డిస్నీ నూతన చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా కరణ్‌దీప్ ఆనంద్‌ను నియమించింది. క్యారక్టర్. ఏఐ సంస్థ సీఈఓగా పనిచేసిన ఆయన అక్టోబర్ 2న నూతన బాధ్యతలు స్వీకరిస్తారని డిస్నీ వెల్లడించింది. సీటీఓతోపాటు కొత్తగా సృష్టించిన సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గానూ ఆయన కొనసాగుతారని తెలిపింది. మౌలిక సదుపాయాలు, వినియోగదారుల సాంకేతికత, కృత్రిమ మేధ వంటి భిన్న రంగాల్లో కరణ్‌దీప్‌కు విశేష అనుభవం ఉందని, తమ సీనియర్ నాయకత్వ బృందంలో మరో కీలక సభ్యుడిగా ఉంటారని డిస్నీ వెల్లడించింది. మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, బ్రెక్స్ తదితర సంస్థల్లో సుదీర్ఘకాలం పాటు పనిచేసిన కరణ్‌దీప్.. బ్యాచిలర్ డిగ్రీని ఐఐఐటీ హైదరాబాద్‌లోనే పూర్తి చేశారు.

# డబ్ల్యూఏపీఎల్.. అమరావతి ఈ ఛాంపియన్స్‌దే విజయం

తొలిసారి జరుగుతోన్న మహిళల ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లో అమరావతి ఈ ఛాంపియన్స్ శుభారంభం చేసింది. తన మొదటి మ్యాచ్‌లోనే వైజాగ్ ఫైర్ బర్డ్స్‌పై 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ నెగ్గిన వైజాగ్ బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత అమరావతి ఈ ఛాంపియన్స్ బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. ఓపెనర్ రంగ లక్ష్మి (102) అద్భుతమైన శతకం సాధించింది. దీక్ష (43) రాణించింది. అనంతరం లక్ష్య ఛేదనలో వైజాగ్ 146/6 స్కోరుకే పరిమితమైంది. ఆ జట్టు బ్యాటర్లలో పుష్పలత (60) హాఫ్ సెంచరీ నమోదు చేసింది. అయేషా సింగ్ (35*), శర్వాణి (24) ఫర్వాలేదనిపించారు. అమరావతి




బౌలర్లలో దేవిక 2.. విష్ణుప్రియ, తరిణి జోషి, పూజిత తలో వికెట్ తీశారు.

**రంగ లక్ష్మి అరుదైన ఘనత**

మహిళల ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లో రంగ లక్ష్మి అరుదైన ఘనత సాధించింది. ఈ లీగ్‌లో తొలి సెంచరీ చేసిన బ్యాటర్‌గా రంగ లక్ష్మి నిలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సొంతం చేసుకుంది. ఓ వైపు కెప్టెన్ నీరగట్టు అనూష (10) త్వరగానే పెవిలియన్‌కు చేరినా మరో ఎండ్‌లో రంగ లక్ష్మి మాత్రం పట్టు వదల్లేదు. బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఈ క్రమంలో 71 బంతుల్లో శతకం పూర్తి చేసింది. దీక్షతో కలిసి రెండో వికెట్‌కు 90 పరుగులు జోడించింది. అయితే, స్వల్ప వ్యవధిలో వీరిద్దరూ పెవిలియన్‌కు చేరడంతో ఆఖర్లో స్కోరు బోర్డు వేగం తగ్గింది. వైజాగ్ బౌలర్లలో శర్వాణి, రిషిక, శరణ్య తలో వికెట్ తీశారు.

*** అంతకుముందు తొలి మ్యాచ్‌లో..**

డబ్ల్యూఏపీఎల్ తొలి మ్యాచ్ గోదావరి గోల్డెన్ ఈగల్స్ రాయలసీమ జెన్ స్టార్స్ మధ్య జరిగింది. గోదావరిపై రాయలసీమ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన గోదావరి జట్టు 116 పరుగులు చేసింది. అనంతరం ఛేదనకు దిగిన రాయలసీమ టీమ్ 17.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి టార్గెట్‌ను ఛేదించింది. శుభ శ్రీ 23, సేతు సాయి 33, పద్మజ 30* రన్స్ చేశారు. గోదావరి బౌలర్లలో హారిక, పెరైరా, విన్నీ సుజన్ తలో వికెట్ తీశారు.




## టీమ్‌ఇండియాకు
# దుస్తుల సమస్య.. రంగంలోకి బీసీసీఐ..!




ఆసియా క్రీడల కోసం టీమ్‌ఇండియా జట్టు ఆదివారం తెల్లవారుజామున బయల్దేరనుంది. ఆతిథ్య దేశంతో టీ20 మ్యాచ్ కూడా ఆడనుంది. ఈ నేపథ్యంలో ఆటగాళ్లకు కిట్ సమస్యలు వచ్చాయి. తమ జెర్సీ సైజ్ విషయంలో వారు ఇబ్బంది పడుతున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆటగాళ్లు బయల్దేరడానికి కొన్ని గంటలే మిగిలి ఉండటంతో ఈ ఇబ్బందిని పరిష్కరించేందుకు బీసీసీఐ రంగంలో దిగిందని సమాచారం. ఇండియన్ ఒలింపిక్ అసోషియేషన్ కు లైఫ్‌స్టైల్ కిట్ పార్టనర్‌గా వ్యవహరిస్తోన్న జేఎస్‌డబ్ల్యూ ఇన్‌స్పైర్‌తో క్రికెట్ బోర్డు చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. జపాన్‌తో జరిగే టీ20 మ్యాచ్‌కు ఆటగాళ్లు అంతర్జాతీయ టోర్నీలకు వినియోగించే తమ స్టాండర్డ్ కిట్‌ను ఉపయోగించనున్నారు. తర్వాత అధికారిక ఆసియా గేమ్స్ జెర్సీని ధరించాల్సి ఉంది. అయితే, ఇక్కడే క్రికెటర్ల జెర్సీలు, ఇతర దుస్తుల సైజు విషయంలో సమస్యలు వచ్చాయని , వాటిలో చాలావాటిని సరిదిద్దామని ఐఓఏ వర్గాలు వెల్లడించాయి. సరిచేసిన కిట్లు త్వరలోనే జట్టుకు అందుతాయని చెప్పాయి. ప్రస్తుతం ఆటగాళ్లకు రెండు వేర్వేరు జెర్సీల అవసరముందని, అలాంటప్పుడు కొన్నిసార్లు పొరపాట్లు జరుగుతుంటాయని పేర్కొన్నాయి. ఈ కిట్‌లో జెర్సీతో పాటు ట్రావెల్ గేర్, క్యాజువల్ అథ్లెటిక్ వేర్ వంటివి ఉంటాయి.

**వసతి సమస్య కూడా..**

ఆసియా క్రీడల ఆతిథ్యనగరం నగోయాలో భారత అథ్లెట్లకు వసతి కేటాయింపు విషయంలో తీవ్ర ఆలస్యం జరుగుతున్న సంగతి తెలిసిందే. దీంతో బీసీసీఐ పురుషుల జట్టు కోసం స్వయంగా వేరే హోటల్‌లో వసతి ఏర్పాట్లు చేసింది. భారత మహిళల క్రికెట్ జట్టుకు మాత్రం ఐఓఏ ఏర్పాటు చేసిన వసతినే ఉపయోగించుకుంటుంది. వారికి ఎలాంటి సమస్యా లేదని తెలిపింది. ఆసియా క్రీడల క్రికెట్ టోర్నీకి ముందు జపాన్‌తో భారత్ సెప్టెంబర్ 22న టీ20 మ్యాచ్ ఆడనుంది. ఈ రెండు దేశాల మధ్య జరిగే తొలి అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఇదే. భారత్‌జపాన్ ద్వైపాక్షిక సంబంధాల 75వ వార్షికోత్సవానికి ప్రారంభ సూచికగా ఈ మ్యాచ్ నిర్వహిస్తున్నారు. భారత జట్టుకు శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహించనున్నాడు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ కూడా ఆసియా క్రీడల జట్టులో ఉన్నాడు. ఆసియా క్రీడల్లో పురుషుల క్రికెట్ ఈ నెల 24న మొదలవుతుంది. నేరుగా నాకౌట్లో చోటు సంపాదించిన టీమ్‌ఇండియా.. ఈ నెల 28న తన తొలి మ్యాచ్ ఆడుతుంది.

# ఆసియా గేమ్స్.. మను భాకర్ భావోద్వేగం

ఆసియా గేమ్స్ ప్రారంభోత్సవ వేడుకల వేళ భారత్ షూటర్ మను భాకర్ భావోద్వేగానికి గురయ్యింది. ఇటీవల మృతి చెందిన తన కోచ్ జస్పాల్ రాణా లేని లోటు కనిపిస్తోందంటూ కన్నీరు పెట్టుకుంది. ప్రారంభోత్స వేడుకల్లో భాగంగా కబడ్డీ స్టార్ పవన్ షెహ్రావత్‌తో కలిసి భారత జట్టుకు పతాకధారిగా వ్యవహరించిన మను భాకర్.. ఆ తర్వాత మీడియాతో మాట్లాడింది. "ఇలాంటి ప్రఖ్యాత ఈవెంట్ జరుగుతున్న వేళ.. జస్పాల్ సార్ లేకపోవడం బాధగా ఉంది.ఈ రోజంతా చాలా భారంగా గడిచింది. నా జీవితంలో ఆయన లేని లోటు పూడ్చలేనిది" అని తెలిపింది. ఈ ఏడాది




జూన్‌లో జస్పాల్ రాణా కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో భాగంగా జర్మనీ నుంచి భారత్‌కు తిరిగివస్తుండగా రాణా అనారోగ్యానికి గురయ్యారు. విమానం దిగిన వెంటనే ఆయన్ను దిల్లీలోని ఆసుపత్రిలో చేర్చగా.. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్యాలు గెలిచిన మను బాకర్‌కు రాణా వ్యక్తిగత కోచ్‌గా వ్యవహరించారు. కాగా, మను భాకర్ ఆసియా క్రీడల్లో పాల్గొనడం ఇది మూడోసారి. 2022 ఆసియా క్రీడల్లో 25 మీటర్ల పిస్టల్ టీమ్ విభాగంలో ఈషా సింగ్, రిథమ్ సాంగ్వాన్‌తో కలిసి బంగారు పతకం సాధించింది. తాజా గేమ్స్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 25 మీటర్ల పిస్టల్, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్స్‌లో బరిలోకి దిగేందుకు సిద్ధమైంది.

# ఆసియా గేమ్స్.. నఖ్వీ చేతుల మీదుగా మెడల్స్ తీసుకోవాల్సిందేనా..?

ఆసియా క్రీడల్లో భారత్‌కు మళ్లీ 'నఖ్వీ' సమస్య ఎదురవుతుందా? జపాన్ వేదికగా జరుగుతోన్న ఈ టోర్నీలో భారత క్రికెట్ జట్లు పతకాలు సాధిస్తే.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఛైర్మన్, ఏసీసీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ చేతుల మీదుగా వాటిని స్వీకరించాల్సిందేనా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మరి దీనికి నిబంధనలు ఏం చెబుతున్నాయి..? బీసీసీఐ స్పందన ఏంటీ..? ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (OCA) నిబంధనల ప్రకారం.. ఆసియా ఒలింపిక్ మండలి అధ్యక్షుడు విజేతలకు మెడల్స్ అందిస్తారు. కొన్ని సందర్భాల్లో ఈ పతకాలు అందించే బాధ్యతను ఓసీఏలోని ఇతర సభ్యులకు కూడా అప్పగించే అధికారం అధ్యక్షుడికి ఉంటుంది. ప్రస్తుతం ఆసియా ఒలింపిక్ మండలిలో నఖ్వీ కూడా సభ్యుడే. ఒకవేళ మెడల్స్ ఇచ్చే బాధ్యతను నఖ్వీకి అప్పగిస్తే.. భారత ఆటగాళ్లు వాటిని స్వీకరించాల్సి ఉంటుందని భారత ఒలింపిక్ సంఘం (IOA) వర్గాలు తెలిపాయి. అందుకు తిరస్కరిస్తే, గేమ్స్‌ను అగౌరపరిచిన కిందకే వస్తుందని పేర్కొన్నాయి. ఇక, మెడల్స్




ప్రదానోత్సవంలో ఎలాంటి రాజకీయ, మతపరమైన ప్రచారానికి అనుమతి ఉండదు.

ఆదివారం 20-09-2026

పత్రికతో.. మార్పులు
TN తెలుగు న్యూస్
మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..
దిన పత్రిక



# సమంత ఛాన్స్ కొట్టేసిందా!

చెన్నై బ్యూటీ శృతి హాసన్ ఓ హాలీవుడ్ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సమంత చేయాల్సిన పాత్రలో కమల్ తనయ కనిపించబోతుంది. సమంత హీరోయిన్‌గా బాఫ్టా అవార్డు గ్రహీత ఫిలిప్ జాన్ దర్శకత్వంలో ది అరెంజ్‌మెంట్స్ ఆఫ్ లవ్ పేరుతో రెండేళ్ల క్రితం ఈ మూవీని అనౌన్స్ చేశారు. సమంత ఫస్ట్ హాలీవుడ్ మూవీ కావడంతో ప్రకటనతోనే తెలుగు ఆడియెన్స్‌లో ఈ సినిమా ఆసక్తిని రేకెత్తించింది. కానీ సమంత ప్రెగ్నెన్సీ కారణంగా షూటింగ్ మళ్లీ డైలమాలో పడింది. దీంతో ఆమె స్థానంలో శృతి హాసన్‌ను హీరోయిన్‌గా ఫైనల్ చేసినట్లు సమాచారం. ఈ సినిమాలో అను డిటెక్టివ్ గా ఈ బ్యూటీ కనిపించబోతుంది. తిమోరి ఎన్ మురారి రాసిన నవల ఆధారంగా ఈ మూవీ రూపొందుతోండగా ఇంగ్లీష్‌తో పాటు తమిళంలోనూ తెరకెక్కిస్తున్నారు.





# ఎన్టీఆర్ ఈజ్ బ్యాక్

భుజం గాయం నుంచి కోలుకున్న యంగ్ టైగర్ ఎన్టీఆర్ తిరిగి డ్రాగన్ షూటింగ్‌ను మొదలుపెట్టబోతున్నారు. మరో రెండు వారాల్లో సెట్స్‌లో అడుగుపెట్టనున్నారు. గత మూడు నెలలుగా సినిమాలకు బ్రేక్ తీసుకున్న ఎన్టీఆర్ అక్టోబర్ ఫస్ట్ వీక్ నుంచి డ్రాగన్ చిత్రీకరణలో భాగం కాబోతున్నారు. హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ఎన్టీఆర్, రుక్మిణి వసంత్‌లపై ఓ రొమాంటిక్ సాంగ్‌తో పాటు కొన్ని లవ్ సీన్స్‌ను షూట్ చేయబోతున్నట్లు సమాచారం. లవ్ ట్రాక్ సినిమాకు హైలైట్‌గా ఉండనుందని అంటున్నారు. నెక్స్ట్ షెడ్యూల్ నుంచి బ్రేక్ లేకుండా నాన్‌స్టాప్‌గా డ్రాగన్ షూటింగ్‌లో పాల్గొనాలని ఎన్టీఆర్ నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. ఈ మూవీని 2027 జూన్ 11న రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది.




# హీరోగా యూట్యూబర్ ఎంట్రీ



తెలుగు యూట్యూబర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ నిఖిల్ విజయేంద్ర సింహా హీరోగా ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. సంగీత్ పేరుతో ఓ మూవీ చేస్తున్నాడు. సంగీత్ మూవీ ఫస్ట్ సింగిల్‌ను శనివారం ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ రిలీజ్ చేశాడు. నీ వల్లే అనే పల్లవితో సాగిన ఈ పాటను విడుదల చేశారు. హీరోహీరోయిన్ల మధ్య ప్రేమను, వారి కెమిస్ట్రీని అందంగా ఆవిష్కరిస్తూ ఈ రొమాంటిక్ లవ్ డ్యూయెట్ సాంగ్‌ను చిత్రీకరించారు. సిద్ శ్రీరామ్ పాడిన ఈ పాటకు అచ్చు రాజమణి సంగీతం అందించగా విక్రమ్ శివ సాహిత్యం సమకూర్చారు. ఈ మూవీలో తేజు అశ్విని హీరోయిన్‌గా నటిస్తోంది. కన్నడ డైరెక్టర్ సాధ్‌ఖాన్ దర్శకత్వం వహిస్తున్నారు. కాగా యూట్యూబ్‌లో సెలబ్రిటీలతో ఇంటర్వ్యూలు, పాడ్‌కాస్ట్‌లతో నిఖిల్ ఫేమస్ అయ్యాడు.

# ఓటీటీలోకి అగధ

కామాక్షి భాస్కర్ల హీరోయిన్‌గా నటించిన తెలుగు హారర్ థ్రిల్లర్ మూవీ అగధ ఓటీటీలోకి వచ్చేస్తోంది. సెప్టెంబర్ 25 నుంచి జీ తెలుగులో స్ట్రీమింగ్ కాబోతుంది. రిలీజ్ డేట్‌ను వెల్లడించిన ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఓ పోస్టర్‌ను అభిమానులతో పంచుకుంది. కేరళ స్టోరీ 2 ఫేమ్ ఉల్కా గుప్తాతో పాటు శ్రవణ్ రెడ్డి, జోవిక విజయ్ కుమార్ కీలక పాత్రల్లో నటించారు. ఛత్తీస్‌ఘడ్‌లోని అడవుల్లో ఉన్న గుహ మిస్టరీని మహాదేవి ఎలా ఛేదించింది? ఆ గుహలో ఉన్న తంత్ర శక్తులతో దేవుడి అండతో ఆమె ఎలా పోరాడింది? మహిమతో మహాదేవికి ఉన్న సంబంధమేమిటన్నదే ఈ మూవీ కథ. ఎంఎస్‌రాజు దర్శకత్వం వహించిన ఈ హారర్ మూవీకి రాకేష్ వెంకటపురం, అరుళ్‌దేవ్ మ్యూజిక్ అందించారు.





# నాకంత టైమ్ లేదు

ఎంఎస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో రష్మిక మందన్నను ఎంపిక చేయడంపై ట్రోల్స్ వస్తున్నాయి. దిగ్గజ సింగర్ పాత్రకు రష్మిక రాంగ్ ఛాయిస్ అని కామెంట్లు పెడుతున్నారు. ఈ ట్రోల్స్‌పై నేషనల్ క్రష్ రియాక్ట్ అయ్యింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో నేషనల్ క్రష్ మాట్లాడింది. "సోషల్ మీడియా యుగంలో విమర్శలు సహజం. ఎంత ఉత్తమంగా నటించినా ఏదో ఒక రూపంలో ట్రోల్స్ ఎదురవుతూనే ఉంటాయి. అందుకే వాటిని పట్టించుకోవడం మానేశా. నాపై నమ్మకంతో దర్శకులు అప్పగించిన పాత్రలకు న్యాయం చేయడానికే ప్రయత్నిస్తా. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి కామెంట్‌కు రిప్లై ఇచ్చే టైమ్ నాకు లేదు. వాటి ప్రభావం నా వ్యక్తిగత జీవితం, సినిమాలపై అస్సలు పడనివ్వను. విమర్శించే వారికి నా నటనతోనే సమాధానం చెప్పడానికి ప్రయత్నిస్తా" అని రష్మిక మందన్న అన్నది.